గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
రిపోర్టర్స్ కావలెను.
Gtv GAUTHAM NEWS
9441735522
9849440951
అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రికకు మరియు Gtv లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు ,ఆర్ సీ ఇంఛార్జీలు, మండల విలేకరులు కావలెను.

# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల కోసం...
24 X 7
Gtv GAUTHAM NEWS
Voice of Truth...
GAUTHAM NEWS TV

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 181, ఎడిటర్,భీముడు నాయక్ పేజిలు : 12, వెల రూ. 1, బుధవారం - 07- ఆగష్టు - 2024
PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

### బ్రిటన్ వెళ్లే భారతీయులు జాగ్రత్త....
## అడ్వైజరీ జారీ చేసిన కేంద్రం


2

బ్రిటన్‌లో వలస వ్యతిరేక గ్రూప్‌ల ఆందోళనలు

దేశమంతా విస్తరించిన నిరసనలు

యూకేకు వచ్చేవారు అప్రమత్తంగా ఉండాలని సూచన

### ఫిజీ దేశపు అత్యున్నత పౌర పురస్కారం
## అందుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము


2

పసిఫిక్ దేశాల్లో పర్యటిస్తున్న భారత రాష్ట్రపతి

ఫిజీ పర్యటనలో ముర్ముకు విశిష్ట గౌరవం

'కంపానియన్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ఫిజీ' ప్రదానం

### తండ్రి తెచ్చిన రిజర్వేషన్లే...
## షేక్ హసీనా రాజీనామాకు దారితీశాయి!

బంగ్లాదేశ్ లో కల్లోలభరిత పరిస్థితులు

రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమం తీవ్రరూపం

ప్రధాని పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనా


2

ఢిల్లీ: భారత్ పొరుగుదేశం బంగ్లాదేశ్ ఇప్పుడు సైనిక పాలనలోకి వెళ్లింది. దీనికంతటికీ కారణం మిగతా..2లో

## బంగ్లాదేశ్ పరిణామాలు... కేంద్రానికి రాహుల్ గాంధీ మూడు కీలక ప్రశ్నలు


2

- పరిణామాలపై స్వల్పకాలిక, దీర్ఘకాలిక వ్యూహం ఉందా? అని ప్రశ్న
- ఢాకా పరిణామాల వెనుక పాక్ కుట్ర ఉందా? అని ప్రశ్న
- ఈ పరిణామాలను ఢిల్లీ ముందే ఉహించిందా? అని అడిగిన రాహుల్ గాంధీ
- పరిస్థితిని భారత్ పర్యవేక్షిస్తోందన్న కేంద్రమంత్రి జైశంకర్

ఢిల్లీ: బంగ్లాదేశ్ పరిస్థితులపై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్‌కు లోక్ సభలో ప్రతిపక్ష మిగతా..2లో

## ప్రవాసుల్ని తెలంగాణకు రమ్మన్న సీఎం రేవంత్ ఇంకేం చెప్పారు?

### తెలంగాణ మీ జన్మభూమి

అమెరికాలో పర్యటిస్తున్న సందర్భంలోనూ ఇదే విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించటం

రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు తీసుకురావడంలో భాగస్వాములు కావాలి

పపంచ స్థాయి మాస్టర్ ప్లాన్ తో హైదరాబాద్ ను అత్యున్నత స్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం

గత సంవత్సరం టీపీసీసీ అధ్యక్షుని హెూదాలో అమెరికాకు వచ్చాను

హైదరాబాద్ : ప్రవాసుల్ని తెలంగాణకు రమ్మన్న సీఎం రేవంత్ ఇంకేం చెప్పారు? గడిచిన కొద్ది రోజులుగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ నోటి నుంచి పదే పదే ఫ్యూచర్ సిటీ మాట రావటం తెలిసిందే. హైదరాబాద్.. సికింద్రాబాద్.. సైబరాబాద్ మాదిరే.. ఫ్యూచర్ సిటీని నెలకొల్పుతామంటూ ఇటీవల ముగిసిన అసెంబ్లీ సమావేశాల్లోనూ పలుమార్లు చెప్పిన సీఎం రేవంత్.. తాజాగా అమెరికాలో పర్యటిస్తున్న సందర్భంలోనూ ఇదే విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించటం గమనార్హం. అంతేకాదు.. న్యూజెర్సీలోని తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాసులతో భేటీ అయిన సందర్భంలో తెలంగాణకు పెట్టుబడులతో రావాలంటూ ఆహ్వానించారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయనేమన్నారంటే.. - రాష్ట్రానికి అత్యధిక పెట్టు బడులు తీసుకు రావడంలో భాగస్వాములు కావాలి. తెలంగాణ మీ జన్మభూమి. మీ దేశంలో మీరు పెట్టిన ప్రతి పెట్టుబడికి తప్పకుండా ప్రయోజనం ఉంటుంది. అంతకు మించిన అత్యుత్తమ ప్రతిఫలం ఉంటుంది. మన ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకుంటే అంతకు మించిన సంతృప్తి బోనస్ ...

తాజాగా అమెరికాలో పర్యటిస్తున్న సందర్భంలోనూ ఇదే విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించటం గమనార్హం. అంతేకాదు.. న్యూజెర్సీలోని తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాసులతో భేటీ అయిన సందర్భంలో తెలంగాణకు పెట్టుబడులతో రావాలంటూ ఆహ్వానించారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయనేమన్నారంటే.. - రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు తీసుకురావడంలో భాగస్వాములు కావాలి.



## కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు!


2లో

గత ప్రభుత్వం పోలీసు వ్యవస్థను ప్రత్యర్థులను వేధించడానికే వాడుకుందని చంద్రబాబు విమర్శ

నేరాల నియంత్రణలో చాలావాటికి సీసీ కెమెరాలను ఉపయోగించుకోవచ్చన్న చంద్రబాబు

అసమర్థ ప్రభుత్వం అనిపించుకోవడానికి సిద్ధంగా లేనని వ్యాఖ్యానించిన చంద్రబాబు

అమరావతి : కలెక్టర్ల సమావేశంలో శాంతి భద్రతల అంశంపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆసక్తికరమైన

## విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల


2

ఈ నెల 13 వరకు నామినేషన్ల స్వీకరణ

ఈ నెల 14 నుంచి 16 వరకు నామినేషన్ల ఉపసంహరణ

ఈ నెల 30న పోలింగ్... సెప్టెంబరు 3న ఓట్ల లెక్కింపు

ఇప్పటికే బొత్సను అభ్యర్థిగా ప్రకటించిన వైసీపీ

త్వరలోనే కూటమి అభ్యర్థిని ప్రకటించనున్న సీఎం చంద్రబాబు

అమ రావతి: విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడు దలైంది. ఈ నెల 13 వరకు నామినేషన్లు మిగతా..2లో

## నామినేటెడ్ పదవుల్లో కొత్త ఫార్ములా.. టీడీపీ - జనసేన - బీజేపీ.. ఎవరికి ఎలా..?

అమరావతి: రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల విషయం ఆసక్తిగా మారింది. దాదాపు అన్ని నామినేటెడ్ పోస్టులను కలుపుకుంటే సుమారు 350 దాకా ఉంటాయని ఒక అంచనా. ఈ నేపథ్యంలో ఈ పదవులు ఎలా తీసుకోవాలి? ఎవరెవరు ఏ ఏ పదవులు పంచుకోవాలి? అనే వ్యవహారం నిన్న మొన్నటి వరకు వివాదంగా మారింది. అయితే తాజాగా దీనిపై ఒక క్లారిటీ వచ్చినట్టు తెలుస్తోంది. మొత్తం 350 నామినేటెడ్ పదవుల్లో 60 శాతం అంటే 210 స్థానాలను టిడిపి తీసుకుం టుందని మిగిలిన 40% లో 25% జనసేన, 15% బిజెపిలు పంచుకునే అవకాశం ఉందని ఆయా పార్టీ వర్గాలు చెబు తున్నాయి. దీనికి సం బంధించి ప్రత్యేకంగా ఒక ఫార్ములాను తయారు చేశారని తెలుస్తోంది. వాస్తవానికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపి ఒంటరిగానే మ్యాజిక్ మార్కు తెచ్చుకుంది. అయినప్పటికీ కూటమి ధర్మానికి కట్టుబడి ఆయా మిగతా..2లో


2లో

మొత్తం 350 నామినేటెడ్ పదవుల్లో 60 శాతం అంటే 210 స్థానాలను టిడిపి తీసుకుంటుంది

కీలకమైన నాయకులు బహిరంగంగానే పదవుల విషయంలో కామెంట్లు చేస్తున్నారు

కూటమి ధర్మానికి కట్టుబడి ఆయా పార్టీలకు మంత్రి పదవులు ఇవ్వడంతో పాటు ప్రభుత్వంలోనూ చోటు కల్పించింది

మరికొందరు నాయకులు సైలెంట్ అయిపోయారు.

## బంగ్లాదేశ్‌లోని భారతీయులతో టచ్‌లోనే ఉన్నాం

- బంగ్లాదేశ్‌లో ఆందోళనకర పరిస్థితులు
- ఆ దేశంలోని భారతీయుల భద్రత పట్ల ఆందోళన
- ఈ నేపథ్యంలో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కీలక ప్రకటన
- అక్కడ ఉంటున్న సుమారు 19 వేల మందితో టచ్‌లోనే ఉన్నట్లు వెల్లడి


2లో

ఢిల్లీ: బంగ్లాదేశ్‌లో నెలకొన్న అనిశ్చితి కారణంగా ఆ దేశంలో ఉంటున్న భారతీయుల భద్రత పట్ల ఆందోళనమిగతా..2లో

## జగన్ చేసిన సంతకం.. చంద్రబాబు కాదనలేరు.. వద్దనలేరు..!


2లో

- పాలసీల విషయంలో మార్పులు చేర్పుల దిశగా చంద్రబాబు ప్రభుత్వం అడుగులు
- జగన్ తీసుకున్న నిర్ణయాలు కేంద్ర ప్రభుత్వం వద్ద చేసుకున్న ఒప్పందాలు.
- చేసిన సంతకాలు వంటి వాటిని మార్చడం చంద్రబాబు ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది
- కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జగన్ రాష్ట్రంలో అమలు చేయడం ప్రారంభించారు
- ఈ సంవత్సరం రావలసినటువంటి అదనపు అప్పు రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే అవకాశం లేదు.
- ఎన్నికలకు ముందు చంద్రబాబు చెప్పినా దీన్ని చేయలేకపోయారు

అమరావతి : వైసిపి హయాంలో జరిగిన అనేక నిర్ణయాలు, అనేక పాలసీల విషయంలో మార్పులు చేర్పుల దిశగా చంద్రబాబు ప్రభుత్వం అడుగులు వేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే పలు పథకాలకు పేర్లు మార్చారు. కొన్నింటిని కొత్తగా ప్రవేశపెట్టాలని కూడా భావిస్తున్నారు. అయితే, ప్రధానంగా ఎన్ని మార్పులు చేయాలనుకున్నా కొన్ని కొన్ని విషయాల్లో జగన్ తీసుకున్న నిర్ణయాలు కేంద్ర మిగతా..2లో

## జగన్‌కు ముఖ్యమంత్రికి ఇచ్చే భద్రత ఇవ్వడం కుదరదు.. ఏపీ పోలీసు శాఖ వివరణ


2

మూడు షిఫ్టుల్లో పనిచేసేలా మొత్తం ఆరుగురు ఫ్రిస్కర్లు, స్క్రీనరు

హెూదాలో అదనంగా కల్పించే భద్రతను మాత్రమే తగ్గించామని ఏపీ పోలీసు శాఖ

ఆరుగురు పీఎస్‌వోలు 24 గంటల పాటు నిరంతర భద్రత కల్పిసారు

అమరావతి: తన వ్యక్తిగత భద్రతను తగ్గించారని మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ చేసిన ఆరోపణలపై ఏపీ పోలీసు శాఖ, ప్రభుత్వ వర్గాల స్పందించాయి.

## మన విద్యార్థులకు అన్యాయం చేస్తారా?


2

- జీవో 33 ప్రకారం మన విద్యార్థులకు నష్టం జరుగుతుందన్న కేటీఆర్
- ఈ నిర్ణయం ప్రకారం ఇతర రాష్ట్రాల విద్యార్థులు తెలంగాణలో లోకల్ అవుతారని వెల్లడి
- తమ హయంలో నాలుగేళ్ల గరిష్ఠంగా ఎక్కడ చదివితే అదే స్థానికతగా గుర్తించామని వెల్లడి

హైదరాబాద్ : మెడిసిన్ సీట్ల విషయంలో తెలంగాణ విద్యార్థులకు అన్యాయం చేస్తారా?

### బ్రిటన్ వెళ్లే భారతీయులు జాగ్రత్త....

# అడ్వైజరీ జారీ చేసిన కేంద్రం

ఢిల్లీ: లండన్‌లోని భారత హైకమిషన్ మంగళవారం నాడు భారతీయులకు ట్రావెల్ అడ్వైజరీని జారీ చేసింది. ఇటీవల దేశంలో నిరసనలు, హింసాకాండ నేపథ్యంలో బ్రిటన్ వెళ్లాలనుకునే వారు అప్రమత్తంగా ఉండాలని భారత పౌరులకు సూచించింది. వలస వ్యతిరేక గ్రూప్‌లు బ్రిటన్‌లోని పలు నగరాలు, పట్టణాల్లో నిరసనలు చేపట్టాయి. ఇవి హింసాత్మకంగా మారాయి. ఇవి దేశమంతా విస్తరించిన క్రమంలో అక్కడి భారతీయులను కేంద్రం అప్రమత్తం చేసింది. అలాగే ట్రావెల్ అడ్వైజరీని జారీ చేసింది. "యూకేలోని పలు ప్రాంతాల్లో ఇటీవల జరిగిన అల్లర్ల గురించి భారత ప్రయాణికులకు తెలిసే ఉంటుంది. లండన్‌లోని భారత హైకమిషన్ పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తోంది. భారత్ నుంచి యూకేకు వచ్చే సందర్శకులు అప్రమత్తంగా ఉండాలి. అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. స్థానిక భద్రతా సంస్థలు, మీడియా సంస్థలు జారీ చేసే సూచనలను అనుసరించాలి. నిరసనలు జరుగుతున్న ప్రాంతాలకు దూరంగా ఉండటం మంచిది" అని పేర్కొంది. మీ వ్యక్తిగత భద్రత కోసం నిరసనలు జరుగుతున్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించింది. ఇంగ్లాండ్‌లో కొన్నిరోజుల క్రితం ఓ డ్యాన్స్ క్లాస్?లో చిన్నారులపై దుండగులు కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో ముగ్గురు పిల్లలు మృతి చెందారు. ఇది ఆందోళనలకు కారణమైంది. ఈ ఆందోళనలు ఆ తర్వాత వలస వ్యతిరేక నిరసనలకు దారి తీసింది. పలు నగరాల్లో నిరసనకారులు, పోలీసుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఆందోళనకారులు రాళ్లు రువ్వడం, బాణసంచా కాల్చి విసరడం, శరణార్థులకు ఆశ్రయం కల్పిస్తున్న హోటల్స్‌పై దాడి వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ఆందోళనకారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రధాని కీర్ స్టార్మర్ అధికారులను ఆదేశించారు.

## ఫిజీ దేశపు అత్యున్నత పౌర పురస్కారం అందుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఢిల్లీ : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పసిఫిక్ దేశాల్లో పర్యటిస్తున్నారు. తాజాగా, ఫిజీ దేశంలో పర్యటిస్తున్న ద్రౌపది ముర్ముకు ఆ దేశ ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారం 'కంపానియన్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ఫిజి' ప్రదానం చేసింది. ఫిజీ అధ్యక్షుడు రటు విలియమే మైవాలిలి కటోనివెరే ఇవాళ జరిగిన ఓ కార్యక్రమంలో ఈ పురస్కారంతో భారత రాష్ట్రపతిని గౌరవించారు. దీనిపట్ల ద్రౌపది ముర్ము ఫిజీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరుదేశాల మధ్య ఉన్న సంబంధాలను ముర్ము ఈ సందర్భంగా ప్రస్తుతించారు. ఫిజీని దృఢమైన, స్థితిస్థాపక, సుసంపన్న దేశంగా మలిచే దిశగా భారత్ భాగస్వామ్యం కుదుర్చుకునేందుకు సంసిద్ధంగా ఉందని ముర్ము స్పష్టం చేశారు.

## తండ్రి తెచ్చిన రిజర్వేషన్లే... షేక్ హసీనా రాజీనామాకు దారితీశాయి!

మొదటి పేజి తరువాయి

దీనికంతటికీ కారణం బంగ్లాదేశ్ జాతిపిత, మాజీ అధ్యక్షుడు ముజిబుర్ రెహ్మాన్ గతంలో తెచ్చిన రిజర్వేషన్లు. నిన్నటి వరకు బంగ్లాదేశ్ ప్రధానిగా ఉన్న షేక్ హసీనా ముజిబుర్ రెహ్మాన్ కుమార్తే. తండ్రి తెచ్చిన రిజర్వేషన్లు ఆమె రాజీనామాకు దారితీశాయి. 1971లో బంగ్లాదేశ్ విముక్త పోరాటం జరగ్గా, పెద్ద సంఖ్యలో అసువులుబాశారు. ఈ నేపథ్యంలో, బంగ్లాదేశ్ సివిల్ సర్వీసుల్లో స్వాతంత్ర్య పోరాటయోధులకు 30 శాతం, స్వాతంత్ర్య పోరాటంలో శత్రుసైన్యం చేతిలో అత్యాచారాలకు గురైన మహిళలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఈ మేరకు 1972లో ముజిబుర్ రెహ్మాన్ నాయకత్వంలోని ప్రభుత్వం రిజర్వేషన్లు ప్రక టించింది. ఆ తర్వాత 1996లో ఈ రిజర్వేషన్లను స్వాతంత్ర్య సమరయోధుల పిల్లలకు విస్తరింపజేశారు. 2009 నాటికి స్వాతంత్ర్య పోరాట యోధుల మనవళ్లు, మనవరాళ్లకు కూడా వర్తింపజేస్తున్నట్టు ప్రకటించారు. ఈ తరహా రిజర్వేషన్లపై 2013లోనే నిరసన జ్వాలలు రాజుకున్నాయి. బంగ్లాదేశ్ సివిల్ సర్వీసుల్లో ఉద్యోగాలు సాధించలేకపోయిన వందలాది మంది రోడ్లెక్కి నిరసనలు ప్రారంభించారు. ఈ రిజర్వేషన్ల వ్యవహారం కోర్టుల్లోనూ విచారణకు వచ్చింది. ఈ విధమైన రిజర్వేషన్లను బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు కుదిస్తూ, గత నెల 21న కీలక తీర్పు ఇచ్చినప్పటికీ, అసంతృప్తి గళాలు మరింత విజృంభించాయి. దాంతో ఆందోళనలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. బంగ్లాదేశ్ రాజధాని ఢాకా సహా ప్రధాన నగరాలన్నీ నిరసనలతో భగ్గుమన్నాయి. 300 మంది వరకు ప్రాణాలు కోల్పోగా, ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేయాలంటూ డిమాండ్లు బలంగా వినిపించాయి. చివరికి, ఆందోళనకారులు నిన్న మధ్యాహ్నం ఢాకాలోని ప్రధాని అధికారిక నివాసాన్ని ముట్టడించడం ఈ రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమానికి పరాకాష్ఠగా నిలిచింది. దాంతో, షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసి, సైనిక విమానంలో భారత్ చేరుకున్నారు.

## మన విద్యార్థులకు అన్యాయం చేస్తారా?

మొదటి పేజి తరువాయి

స్థానికత విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అనుమానాస్పదంగా కనిపిస్తోందన్నారు. జీవో 33 ప్రకారం నిర్దేశించిన స్థానికతలోని అంశాలు, ప్రభుత్వం వేలితో విద్యార్థుల కళ్లను పొడిచినట్లే ఉన్నాయన్నారు. 9 వ తరగతి నుంచి 12 తరగతి వరకు మన వద్ద చదివిన విద్యార్థులే స్థానికులు అవుతారని ప్రభుత్వం చెబుతోందని, ఈ నిర్ణయం ప్రకారం చాలామంది ఇతర రాష్ట్రాల విద్యార్థులు తెలంగాణలో లోకల్ అవుతారన్నారు. హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు ఉన్నందున ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు చాలామంది ఇక్కడే విద్యాభ్యాసం చేస్తున్నారని గుర్తు చేశారు. కొత్త నిబంధనల ప్రకారం వారంతా తెలంగాణలో లోకల్ అవుతారన్నారు. అలాగే ఇతర రాష్ట్రాలలో చదివే మన విద్యార్థులు నాన్ లోకల్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. 2023-24 విద్యాసంవత్సరం వరకు 6 వ తరగతి నుంచి 12 తరగతి వరకు నాలుగేళ్లు గరిష్ఠంగా ఎక్కడ చదివితే అదే స్థానికతగా తాము గుర్తించామన్నారు. దాని కారణంగా మన విద్యార్థులు ఇంటర్మీడియెట్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పటికీ వారు లోకల్‌గానే పరిగణించబడే వారని పేర్కొన్నారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం చెబుతున్న కొత్త నిబంధనల ప్రకారమైతే వేలాదిమంది ఇతర రాష్ట్రాల విద్యార్థులు తెలంగాణలో లోకల్ అవుతారని, మన విద్యార్థులు మెడికల్ సీట్లు కోల్పోయే ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరగకుండా... గతంలో అనుసరించిన విధానాన్నే అనుసరించాలని డిమాండ్ చేశారు.

## జగన్‌కు ముఖ్యమంత్రికి ఇచ్చే భద్రత ఇవ్వడం కుదరదు..

మొదటి పేజి తరువాయి

సీఎం, వైసీపీ అధినేత జగన్ చేసిన ఆరోపణలపై ఏపీ పోలీసు శాఖ, ప్రభుత్వ వర్గాల స్పందించాయి. ముఖ్యమంత్రి హోదాలో కేంద్రప్రభుత్వం తనకు కల్పించిన జడ్ ప్లస్ సెక్యూరిటీని ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తగ్గించడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని జగన్ హైకోర్టును ఆశ్రయించడాన్ని తప్పుబట్టాయి.

భద్రతను తగ్గించారంటూ ఆయన చేస్తున్న వాదన నిజం కాదని స్పష్టం చేశాయి.

జగన్ ముఖ్యమంత్రిగా కొనసాగిన సమయంలో ఆ హోదాలో అదనంగా కల్పించే భద్రతను మాత్రమే తగ్గించామని ఏపీ పోలీసు శాఖ తెలిపింది. ప్రస్తుతం మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ముఖ్యమంత్రికి కల్పించే భద్రత ఇవ్వడం కుదరదని స్పష్టం చేసింది. చంద్రబాబు మాజీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎంత భద్రత కల్పించామో.. ఇప్పుడు జగన్‌కూ అంతే భద్రత కొనసాగిస్తున్నామని వివరించింది. ప్రస్తుతం జగన్‌కు 57 మంది సిబ్బందితో భద్రత కల్పిస్తున్నామని పోలీసు శాఖ తెలిపింది. జగన్ ఇంటి వద్ద 10 మంది సాయుధ గార్డుల భద్రత ఉందని.. షిఫ్టునకు ఇద్దరు చొప్పున మొత్తం ఆరుగురు పీఎస్‌వోలు 24 గంటల పాటు నిరంతర భద్రత కల్పిస్తారని చెప్పింది. మొత్తం 24 మంది సిబ్బందితో రెండు ఎస్కార్ట్ బృందాలు ఎప్పుడు ఆయనతోనే ఉంటాయని తెలిపింది. పగలూ, రాత్రి కలిపి మొత్తం ఐదుగురు వాచర్లను ఏర్పాటు చేశామని పేర్కొంది. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిని భద్రతా ఇన్‌ఛార్జిగా పెట్టామని తెలిపింది. మూడు షిఫ్టుల్లో పనిచేసేలా మొత్తం ఆరుగురు ఫ్రిష్కర్లు, స్క్రీనర్లు, నిరంతరం అందుబాటులో ఉండేలా ఆరుగురు డ్రైవర్లను జగన్‌కు కేటాయించామని వెల్లడించింది.

## విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

మొదటి పేజి తరువాయి



ఈ నెల 13 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. ఈ నెల 30న ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ జరగనుంది. సెప్టెంబరు 3న కౌంటింగ్ చేపట్టనున్నారు. విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న చెన్నుబోయిన వంశీకృష్ణ వైసీపీని వీడి, ఇటీవల పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరారు. వంశీకృష్ణపై వైసీపీ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో, మండలి చైర్మన్ అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. దాంతో విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. వైసీపీ అభ్యర్థిగా ఇప్పటికే మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పేరును జగన్ ప్రకటించారు. కూటమి అభ్యర్థి ఎవరన్నది ఇంకా నిర్ణయం కాలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి నేతలతో చర్చించి దీనిపై ప్రకటన చేసే అవకాశాలున్నాయి.

# జగన్ చేసిన సంతకం.. చంద్రబాబు కాదనలేరు.. వద్దనలేరు..!

మొదటి పేజి తరువాయి

ఈ క్రమంలోనే పలు పథకాలకు పేర్లు మార్చారు. కొన్నింటిని కొత్తగా ప్రవేశపెట్టాలని కూడా భావిస్తున్నారు. అయితే, ప్రధానంగా ఎన్ని మార్పులు చేయాలనుకున్నా కొన్ని కొన్ని విషయాల్లో జగన్ తీసుకున్న నిర్ణయాలు కేంద్ర ప్రభుత్వం వద్ద చేసుకున్న ఒప్పందాలు.. చేసిన సంతకాలు వంటి వాటిని మార్చడం చంద్రబాబు ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది.! మానసికంగా చూస్తే ఆయా ఒప్పందాలను రద్దు చేసుకోవాలని ఉంది. కానీ కేంద్రంలో ఉన్న బిజెపితో పొత్తు పెట్టుకోవడం, బిజెపితో స్నేహంగా కొనసాగుతూ ప్రభుత్వాన్ని ముందుకు నడిపిస్తున్న క్రమంలో వాటిని కాదంటే బిజెపి ఏమంటుందో అనే ఒక సమస్య ఇప్పుడు చంద్రబాబుకు ఏర్పడింది. ప్రధానంగా రెండు కీలక అంశాలు ఇప్పుడు చంద్రబాబుకు సంకటంగా మారాయి. ఒకటి చెత్త పై పన్ను. ఇది జగన్ హయాంలో 2020లో తీసుకొచ్చిన కీలక అంశం. ఇది కేంద్ర ప్రభుత్వం నిర్ణయం. దీని ప్రకారం చెత్తను కూడా ఆదాయంగా మార్చుకోవాలి అన్న ఉద్దేశంతో దాని మీద పన్ను వెయ్యాలని సంకల్పం చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జగన్ రాష్ట్రంలో అమలు చేయడం ప్రారంభించారు. ఎన్నికలకు ముందు కొన్నాళ్లపాటు నిలిపి వేసినా తర్వాత మళ్ళీ కొనసాగిస్తున్నారు. వాస్తవానికి చెత్త మీద పనులు తీసేస్తామని.. ఎన్నికలకు ముందు చంద్రబాబు చెప్పినా దీన్ని చేయలేకపోయారు. దీనికి కారణం చెత్త మీద పన్ను వేయడం ద్వారా కొంతమేరకు అప్పు తెచ్చుకునే వెసులబాటు అప్పట్లో కేంద్ర ప్రభుత్వం కల్పించింది. దీన్ని జగన్ వినియోగించుకున్నారు. ఎంపీల భవితవ్యం ఏమిటో? ఇప్పుడు దీన్ని తీసేస్తే ఈ సంవత్సరం రావలసినటువంటి అదనపు అప్పు రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే అవకాశం లేదు. అంటే ఏ



సంవత్సరానికి ఆ సంవత్సరం చెత్తపై పన్ను విధించడం ద్వారా కొంతమేరకు అప్పులు చేసుకునే వెసులుబాటు ఉంది. దీన్ని కాదంటే వచ్చే అప్పులు ఆగిపోతాయి. అలాగని కొనసాగిస్తే ఇటు ప్రజల్లో వ్యతిరేకత కొనసాగుతుంది. దీంతో చంద్రబాబు సంకట స్థితిని ఎదుర్కొంటు న్నారని చెప్పాలి. ఇక రెండో అంశం స్మార్ట్ మీటర్లు. రాష్ట్రంలో రైతులు వినియోగిస్తున్న విద్యుత్తుకు మీటర్లు పెట్టాలని, ఎంత విద్యుత్ వాడుతున్నారనేది తెలుసుకోవాలని కేంద్రం చెబుతోంది. రాను రాను విద్యుత్ విషయంలో వస్తున్న నష్టాలు కేంద్ర ప్రభుత్వంపై పడుతున్న భారం వంటివి గమనించిన మోడీ ప్రభుత్వం.. 2019 నుంచి దీన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించింది. అయినప్పటికీ చాలా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయలేదు. స్మార్ట్ మీటర్లు పెడితే అదనంగా 0.5% అప్పులు తెచ్చుకునేందుకు అనుమతిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో జగన్మోహన్ రెడ్డి ఆ అప్పు కోసమైనా మీటర్లు పెట్టాలన్న ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా మీటర్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికలకు ముందు దీని తీవ్రంగా వ్యతిరేకించిన చంద్రబాబుకు ఇప్పుడు వీటిని తీసేయడం సమస్యగా మారింది. ఎందుకంటే స్మార్ట్ మీటర్లను కొనసాగిస్తే ఈ సంవత్సరం కూడా కేంద్ర ప్రభుత్వం 0.5% అప్పు అదనంగా ఇస్తుంది. కాబట్టి అప్పు లేకుండా పథకాలు అమలు చేసే అవకాశం లేనందున స్మార్ట్ మీటర్లను కొనసాగించాలని చంద్రబాబు అంతర్గత చర్చల్లో వెల్లడవుతున్న విషయం. సో.. జగన్ చేసిన సంతకాలు, చేసుకున్న ఒప్పందాల విషయంలో చంద్రబాబు ప్రభుత్వానికి కాదనలేని, వద్దనలేని పరిస్థితి ఏర్పడడం మాత్రం గమనార్హం.

# ప్రవాసుల్ని తెలంగాణకు రమ్మన్న సీఎం రేవంత్ ఇంకేం చెప్పారు?

మొదటి పేజి తరువాయి

గడిచిన కొద్ది రోజులుగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ నోటి నుంచి పదే పదే ఫ్యూచర్ సిటీ మాట రావటం తెలిసిందే. హైదరాబాద్.. సికింద్రాబాద్.. సైబరాబాద్ మాదిరే.. ఫ్యూచర్ సిటీని నెలకొల్పుతామంటూ ఇటీవల ముగిసిన అసెంబ్లీ సమావేశాల్లోనూ పలుమార్లు చెప్పిన సీఎం రేవంత్.. తాజాగా అమెరికాలో పర్యటిస్తున్న సందర్భంలోనూ ఇదే విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించటం గమనార్హం. అంతేకాదు.. న్యూజెర్సీలోని తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాసులతో భేటీ అయిన సందర్భంలో తెలంగాణకు పెట్టుబడులతో రావాలంటూ ఆహ్వానించారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయనేమన్నారంటే.. - రాష్ట్రానికి అత్యధిక పెట్టు బడులు తీసుకు రావడంలో భాగస్వాములు కావాలి. తెలంగాణ మీ జన్మభూమి. మీ దేశంలో మీరు పెట్టిన ప్రతి పెట్టుబడికి తప్పకుండా ప్రయోజనం ఉంటుంది. అంతకు మించిన అత్యుత్తమ ప్రతిఫలం ఉంటుంది. మన ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకుంటే అంతకు మించిన సంతృప్తి బోనస్ గా లభిస్తుంది. - హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నాం. ప్రపంచ స్థాయి మాస్టర్ ప్లాన్ తో హైదరాబాద్ ను అత్యున్నత స్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం. హైదరాబాద్ ను అభివృద్ధి చేసేందుకు మీరందరూ కలిసి రావాలి. - గత సంవత్సరం టీపీసీసీ అధ్యక్షుని హోదాలో అమెరికాకు వచ్చాను.



పదేండ్ల పాటు సాగిన దుష్పరిపాలనకు, విధ్వంసాలకు విముక్తి పలికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే మళ్లీ వస్తానని చెప్పాను. నేను ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాను. - మీ నైపుణ్యాలు, మీ ప్రతిభా పాటవాలతో అమెరికాను పటిష్టంగా, సంపన్నంగా మార్చారు.ఇకపై తెలంగాణకు మీ సేవలు అందించాలి. తెలంగాణలో మెట్రో కోర్ అర్బన్ తో పాటు , సెమీ అర్బన్, రూరల్ క్లస్టర్లుగా విభజించి పెట్టుబడులకు ప్రత్యేకమైన వ్యవస్థలను రూపొందిస్తున్నాం. - ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని మా ప్రభుత్వం నిలబెట్టుకుంటుంది. ఇప్పటికే రైతులు, మహిళలు, యువకుల సంక్షేమం, అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం. - రైతులకు ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీతో పాటు, ఇన్ పుట్ సబ్సిడీగా రైతు భరోసా, నిరుద్యోగులకు ఉద్యోగాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కు వంట గ్యాస్ సిలిండర్, నిరుపేదలకు 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్తు, ఉపాధ్యాయులకు పదోన్నతులు, విద్యార్థులకు నాణ్యమైన విద్య పథకాలను అమలు చేస్తున్నాం. - ఇది ప్రారంభం మాత్రమే. భవిష్యత్తు ప్రణాళికలతో మా ప్రభుత్వం ముందుకు వెళుతుంది. మా పరిపాలనపై ఎలాంటి అపోహలు, ఆందోళనలకు తావు లేదు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని సమ్మిళిత ఆర్థిక వృద్ధిని వేగంగా సాధించేలా మా ప్రభుత్వం కొత్త పారిశ్రామిక విధానాన్ని తీసుకు వస్తుంది. - నిధుల సమీకరణతో పాటు ఎక్కువ మందికి ఉపాధి కల్పన, నైపుణ్యాల వృద్ధికి అందులో సమానమైన ప్రాధాన్యం ఇస్తాం. ఎన్నికల ముందు మాపై ఎంతో విష ప్రచారం జరిగింది. గిట్టని వాళ్లందరూ అసలు కాంగ్రెస్ అధికారంలోకి రాదన్నారు. వచ్చినా అది ఉండనే ఉండదన్నారు. - ఇప్పుడేమో రాష్ట్రంలో అభివృద్ధి మందగిస్తుందంటూ లేని పోని అపోహలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే వాళ్లకు తగిన బుద్ధి చెప్పాం. అబద్ధాలకోరుల మాటలు తప్పని మరోసారి నిరూపిస్తాం. హైదరాబాద్‌ను భారతదేశంలోనే కాదు.. ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా అభివృద్ధి చేసేందుకు పోటీ పడతాం.

# నామినేటెడ్ పదవుల్లో కొత్త ఫార్ములా..టీడీపీ - జనసేన - బీజేపీ.. ఎవరికి ఎలా..?

ఈ నేపథ్యంలో ఈ పదవులు ఎలా తీసుకోవాలి? ఎవరెవరు ఏ ఏ పదవులు పంచుకోవాలి? అనే వ్యవహారం నిన్న మొన్నటి వరకు వివాదంగా మారింది. అయితే తాజాగా దీనిపై ఒక క్లారిటీ వచ్చినట్టు తెలుస్తోంది. మొత్తం 350 నామినేటెడ్ పదవుల్లో 60 శాతం అంటే 210 స్థానాలను టిడిపి తీసుకుం టుందని మిగిలిన 40% లో 25% జనసేన, 15% బిజెపిలు పంచుకునే అవకాశం ఉందని ఆయా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీనికి సంబంధించి ప్రత్యేకంగా ఒక ఫార్ములాను తయారు చేశారని తెలుస్తోంది. వాస్తవానికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపి ఒంటరిగానే మ్యాజిక్ మార్కు తెచ్చుకుంది. అయినప్పటికీ కూటమి ధర్మానికి కట్టుబడి ఆయా పార్టీలకు మంత్రి పదవులు ఇవ్వడంతో పాటు ప్రభుత్వంలోనూ చోటు కల్పించింది. నామినేటెడ్ పదవుల వ్యవహారంలో తమకు కూడా న్యాయం చేయాలని జనసేన, బిజెపిలో కోరుతున్నా యి. జనసేన బహిరంగంగానే నామినేటెడ్ పదవుల వ్యవహారాన్ని ప్రస్తావిస్తుండగా బిజెపి మాత్రం కేంద్రంలోని బిజెపి నాయకులతో ఇక్కడ పావులు కదుపుతోంది. దీంతో తొలి మాసంలోనే నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని అనుకు న్నప్ప టికీ సమీకరణలు, ఫార్ము లాలు కుదరకపోవడంతో రెండు నెలలు గడిచిపోయాయి. మరోవైపు తాము పార్టీ కోసం ఎంతో కష్టపడి పనిచేసినా ఇంతవరకు గుర్తించడం లేదన్న భావన టిడిపిలో కనిపిస్తోంది. కీలకమైన నాయకులు బహిరంగంగానే పదవుల విషయంలో కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు నాయకులు సైలెంట్ అయిపోయారు. పార్టీ తమను పట్టించుకోనప్పుడు తాము మాత్రం ఎందుకు బయటకు రావాలి అన్న విధంగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో మరింత జాప్యం చేయడం సమంజసం కాదని భావించిన ముఖ్య మంత్రి చంద్రబాబు 60:25:15 ఫార్ములాతో నామినేటెడ్ పదవులు పంచుకునేందుకు సిద్ధమైనట్టు తెలుస్తుంది. ఈ నియమకాలు కూడా ఈనెల చివరిలో లేదా వచ్చేనెల తొలివారం నాటికి పూర్తి చేసే అవకాశం ఉందని సమాచారం. టిడిపి విషయాన్ని తీసుకుంటే ఎవరెవరికి ఇవ్వాలనే విషయంలో ఒక స్పష్టత వచ్చేసింది. క్షేత్రస్థాయిలో నాయకుల నుంచి అదే విధంగా కేడర్ నుంచి తీసుకున్న జాబితా ఇప్పటికే చంద్రబాబుకు చేరింది. ఈ నేపథ్యంలో నాయకులను ఎంపిక చేసే ప్రక్రియను కూడా ఆయన ప్రారంభించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సామాజిక వర్గాలపరంగా ఉన్న కార్పొరేషన్లకు ఆయా వర్గాలను నియమించనున్నారు. అయితే ఈసారి కొంత మార్పు దిశగా అడుగులు వేయాలని చూస్తున్నారు. అంటే కార్పొరేషన్ పరిధిలో ఉంటూ కేవలం ఆ కార్యక్రమాలకే పరిమితం కాకుండా పార్టీ తరఫున కూడా బలమైన వాయిస్ వినిపించే నేతలకు అవకాశం ఇవ్వాలని చంద్రబాబు వ్యూహంగా ఉంది. ఇక ఇతర నామినేటెడ్ పదవులు విషయంలో కొంత ఆచితూచి వ్యవహరించాలని చూస్తున్నారు. ఇటీవల టికెట్లు కోల్పోయినవారు, టికెట్లు త్యాగం చేసిన వారికి ఈసారి ప్రాధాన్యం దక్కనుంది. ఇక జనసేన విషయాన్ని చూస్తే పవన్ కళ్యాణ్ ఎంపిక చేసిన వారు మాత్రమే కనిపిస్తున్నారు. ఈ పార్టీలో



ఎక్కడా సర్వేలు గానీ జాబితాలు రూపొందించే విషయంలో కానీ ఎలాంటి సమాచారం లేదు. బిజెపి విషయాన్ని తీసుకుంటే చాలామంది పాత కాపులకు ఈసారి టికెట్లు ఇవ్వలేదు. ఉదాహరణకు టికెట్ల కోసం ప్రయత్నించిన రాజ్యసభ సభ్యుడు జీవీ ఎల్ నరసింహారావు, సోము వీర్రాజు, విష్ణువర్ధన్ రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి వంటి వారు ఉన్నారు. ఇలా ఓ 15 నుంచి 30 మంది వరకు అవకాశం దక్కించుకునే చాన్స్ కనిపిస్తుందని అంటున్నారు. మొత్తంగా చూస్తే ఉమ్మడిగా నామినేటెడ్ పదవులను పంచుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. ముందు ముందు ఇబ్బందులు రాకుండా కూడా చూసుకునేలా కూటమి పార్టీలు ప్రయత్నిస్తున్నాయి.

### బంగ్లాదేశ్ పరిణామాలు...

## కేంద్రానికి రాహుల్ గాంధీ మూడు కీలక ప్రశ్నలు

మొదటి పేజి తరువాయి

ఎస్ జైశంకర్‌కు లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మూడు కీలక ప్రశ్నలు సంధించారు. వాటికి కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు. బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనలు, షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో రాహుల్ గాంధీ ప్రశ్నలు సంధించారు. ఢాకాలో అధికార మార్పిడి నేపథ్యంలో దౌత్యపరమైన పరిణామాలను ఎదుర్కోవడంలో ప్రభుత్వం వద్ద స్వల్పకాలిక, దీర్ఘకాలిక వ్యూహం ఏమైనా ఉందా? అని రాహుల్ అడిగారు. జైశంకర్ స్పందిస్తూ... బంగ్లాదేశ్ పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని, అందుకు అనుగుణంగా మన చర్యలు ఉంటాయని సమాధానం చెప్పారు. ఈ %నేపదగ మంత్రి ఎస్ జైశంకర్ కీక ప్రకటన అక్కడ ఉంటున్న సుమారు 19 వేల మందితో టచ్‌లోనే ఉన్నట్లు వ్లెడించారు. బంగ్లాదేశ్ నాటకీయ పరిణామాలను న్యూఢిల్లీ ముందే ఊహించిందా? అని రాహుల్ తన మూడో ప్రశ్న అడిగారు. పరిస్థితిని భారత్ గమనిస్తోందని జైశంకర్ వెల్లడించారు. ఇదిలా ఉండగా, పొరుగు దేశం సంక్షోభాన్ని పరిష్కరించడంలో నరేంద్రమోదీ ప్రభుత్వానికి కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు పూర్తి మద్దతు ప్రకటించాయి.

## కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు!

మొదటి పేజి తరువాయి




సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. నేతల నియంత్రణకు సీసీ కెమెరాలను గత ప్రభుత్వం సరిగ్గా వినియోగించు కోలేక పోయిందన్నచంద్రబాబు... ప్రత్యర్థులను వేధించడానికే పోలీస్ వ్యవస్థను వాడుకుందని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న 14 వేల సీసీ కెమెరాలను దేనికి వినియోగిస్తున్నారని చంద్రబాబు ప్రశ్నించగా, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద జంపింగ్ చేసే వాళ్లను గుర్తించడానికి వినియోగిస్తున్నామని అధికారులు చెప్పారు. సీసీ కెమెరాలను సిగ్నల్ వద్ద జంపింగ్ చేసే వారినే కాదు, చాలా వాటికి వినియోగించుకోవచ్చని సీఎం చంద్రబాబు సూచించారు. సీసీ కెమెరాలను ఇంటిగ్రేట్ చేయాలని చెప్పారు. ఎవరైనా నేరాలకు పాల్పడి పారిపోయే ప్రయత్నం చేస్తే వారిని గుర్తించే పరిస్థితి రావాలని అన్నారు. రౌడీ షీటర్లపై నిఘాకు సీసీ కెమెరాలను వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. సినిమా థియేటర్లు, షాపింగ్ మాల్స్ లోనూ సీసీ కెమెరాలను పెట్టాలని ఆదేశించారు. చాలా మంది గంజాయి తాగి నేరాలకు పాల్పడుతున్నారని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వం చర్యల వల్ల నేరగాళ్ల ఇష్టారాజ్యం అన్నట్లుగా పరిస్థితి మారిందంటూ వ్యాఖ్యానించారు. శాంతి భద్రతల అంశంపై సీఎం చంద్రబాబు అధికారులకు పలు కీలక సూచనలు చేస్తూ.. కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో పని చేయాలన్నారు. అసమర్థ ప్రభుత్వం అనిపించుకోవడాన్ని తాను ఇష్టపడనని చంద్రబాబు అన్నారు.

## బంగ్లాదేశ్‌లోని భారతీయులతో టచ్‌లోనే ఉన్నాం

మొదటి పేజి తరువాయి

ఆ దేశంలో ఉంటున్న భారతీయుల భద్రత పట్ల ఆందోళన వ్యక్తం అవుతున్న వేళ విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ మంగళవారం మధ్యాహ్నం పార్లమెంటులో మాట్లాడారు. బంగ్లాదేశ్ లో ఉంటున్న సుమారు 19,000 మందితో టచ్‌లోనే ఉన్నట్లు తెలిపారు. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల కోటాకు వ్యతిరేకంగా చెలరేగిన హింసాకాండలో ఇప్పటివరకు దాదాపు 400మంది ప్రాణాలు కోల్పోయారు. నిరసనకారులు ప్రధాని షేక్ హసీనా రాజీమానాకు పట్టుబట్టడంతో ఆమె తన పదవికి రిజైన్ చేశారు. ఇక ఢాకా సహా ఇతర ప్రాంతాలలో ఉండే భారతీయులకు భద్రత కల్పించాలని భారతదేశం ఆశిస్తున్నట్లు జైశంకర్ అన్నారు. "బంగ్లాదేశ్‌లో పరిస్థితి మారిపోతోంది. ఎంబసీ ద్వారా మేం బంగ్లాదేశ్‌లోని భారతీయ సమాజంతో నిరంతరం టచ్‌లోనే ఉన్నాము. అక్కడ సుమారు 19,000 మంది భారతీయ పౌరులు ఉన్నారు. వీరిలో సుమారు 9,000 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు జులైలో తిరిగి వచ్చేశారు. గత 24 గంటల్లో మేం ఢాకాలోని అధికారులతో కూడా క్రమం తప్పకుండా టచ్‌లోనే ఉంటున్నాం. అక్కడున్న భారతీయులకు తగిన రక్షణ కల్పించాలని కోరుతున్నాం" అని విదేశాంగ మంత్రి చెప్పారు. ఇక ఆ దేశంలోని మైనారిటీల రక్షణపై (బంగ్లాదేశ్ జనాభాలో 90 శాతానికి పైగా ముస్లింలు) విదేశాంగ మంత్రి మాట్లాడుతూ.. "మేము మైనారిటీలకు సంబంధించి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం. వారి రక్షణ, శ్రేయస్సు కోసం పలు కార్యక్రమాలు ఉన్నాయి" అని అన్నారు. కాగా, భారతదేశ ఈశాన్య రాష్ట్రాలు బంగ్లాదేశ్‌తో 4,096 కి.మీ సరిహద్దును పంచుకుంటున్న విషయం తెలిసిందే. ఆ దేశంలో ఆందోళనల కారణంగా చొరబాట్లు ఉండొచ్చనే అనుమానంతో మేఘాలయలో 12 గంటల రాత్రి కర్ఫ్యూ విధించడం జరిగింది. అలాగే సరిహద్దు భద్రతా దళాలను హై అలర్ట్‌లో ఉంచారు.

### ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కీలక పరిణామం...

## ఆ పిటిషన్ వెనక్కి తీసుకున్న కవిత

ఢిల్లీ : ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో అరెస్టై తీహార్ జైల్లో ఉన్న కవిత తాను దాఖలు చేసిన డిఫాల్ట్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. రెగ్యులర్ బెయిల్ రాకపోవడంతో ఆ తర్వాత డిఫాల్ట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై నిన్న విచారణ జరిపిన న్యాయస్థానం తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది. అయితే కవిత ఈరోజు పిటిషన్‌ను ఉపసంహరించుకోవడం గమనార్హం. ఈ మేరకు కవిత తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు కోర్టుకు తెలియజేశారు. చట్ట ప్రకారం ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కోర్టును ఆశ్రయించే అవకాశం ఉందని, అందుకే ఉపసంహరించుకున్నట్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. సీబీఐ ఛార్జిషీట్‌లో తప్పులు ఉన్నాయని పేర్కొంటూ జులై 6న కవిత డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. అయితే అందులో ఎలాంటి తప్పులు లేవని సీబీఐ కోర్టుకు తెలిపింది. సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు న్యాయస్థానం జులై 22న తెలిపింది. ఈ ఛార్జిషీట్‌పై ఈ నెల 9న విచారణ జరగనుంది.

## పచ్ఛధనం-స్వచ్ఛధనం కార్యక్రమంలో పాల్గొన్న

### ప్రత్యేక పాలన అధికారి బాణోత్ మల్సూర్, పాలకుర్తి సోమనాథ ఆలయ చైర్మన్ - సీనియర్ నాయకులు కృష్ణమాచార్యులు




మానుకోట/పాలకుర్తి/(గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా పచ్ఛధనం-స్వచ్ఛధనం కార్యక్రమంలో భాగంగా పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం రాయపర్తి మండలంలోని, కోలాన్ పల్లి, ఆరెగూడెం, జయరాం తండా గ్రామపంచాయతీలలో తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం, పల్లె రూపురేఖలు ప్రజల జీవన ప్రమాణాలు పెంచలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పచ్ఛధనం-స్వచ్ఛధనం కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్యేక పాలన అధికారి బాణోత్ మల్సూర్, పాలకుర్తి సోమనాథ ఆలయ చైర్మన్ %ూ% సీనియర్ నాయకులు కృష్ణమాచార్యులు. ఈ సందర్భంగా ప్రత్యేక పాలన అధికారి బానోత్ మల్చల్ నాయక్ మాట్లాడుతూ ప్రజలందరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అందరూ విధిగా చెట్లు పెంచి పర్యావరణ సమతుల్యతలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోలన్ పల్లి పంచాయతీ సెక్రెటరీ రాకేష్, జయరాం తండా పంచాయితీ సెక్రటరీ భరత్, ఆరెగూడెం పంచయితి సెక్రటరీ రాజు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ముఖ్య నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ముడుపుగళ్ గ్రామానికి

### ప్రధాన రహదారి రోడ్డును నిర్మించాలని సిపిఐ ఆందోళన



మానుకోట జిల్లా (గౌతమ్ న్యూస్): మానుకోట జిల్లా, రూరల్ లో మంగళవారం ముడుపుగల్ గ్రామం ప్రధాన రహదారి రోడ్డును నిర్మించాలని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ మండల కార్యదర్శి తండా సందీప్ హాజరై మాట్లాడుతూ కామ్రేడ్ తండా రామచంద్రు స్థూపం నుండి శనిగాపురం ప్రధాన రహదారికి ఆనుకొని చర్చి వద్దకు రోడ్డును



నిర్మించాలని, ముడుపుగల్, అయోధ్య గ్రామంలోని ప్రజలు ఈ యొక్క రహదారి నిర్మించకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే ఈ యొక్క రోడ్డును నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయక్ వచ్చిన సందర్భంగా ముడుపుగల్ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తానని నిర్దిష్ట మైన హామీ ఇచ్చారని, తక్షణమే వారు ఇచ్చిన హామీని నెరవేర్చుకుని ముడుపుగల్ గ్రామ అభివృద్ధికి పాటుపడాలని, ముడుపుగల్ గ్రామ సమగ్రాభివృద్ధికి సిపిఐ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని, ముడుపుగల్ అభివృద్ధికి రానున్నారోజుల్లో సిపిఐ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామ కార్యదర్శి పొలగాని శ్రీనివాస్, తండా సతీష్, తేజావత్ శ్రీను, జుజ్జూరి సాయి, గుణగంటి శేఖర్, తేజావత్ వినయ్ నాయక్, తేజావత్ విజయ్, తండా మునేందర్, ఏదెల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఈదురు గాలలకు విరిగిన చెట్టును తొలగించిన మహబూబాబాద్ రూరల్ ఎస్ఐ దీపిక, పోలీసు సిబ్బంది





మానుకోట జిల్లా (గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జంగిలిగొండ గ్రామానికి పెట్రోలింగ్ వెళ్లి వస్తుండగా ధూద్య తండ వద్ద ఈదురు గాలులతో రోడ్డుపై చెట్లు కూలినందున రూరల్ ఎస్.ఐ దీపిక తన సిబ్బందితో కలిసి రవాణాకు అంతరాయం కలగకుండా చెట్లను రోడ్డు మీద నుండి తొలగించడం జరిగింది.

## ఆచార్య కొత్తపల్లి జయశంకర్

### ఆశయాల సాధన కోసం మనందరం కృషి చేయాలి

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం కలెక్టరేట్ : ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ , అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ తో కలసి జయశంకర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆచార్య జయశంకర్ జీవిత చరిత్ర సంబంధించిన ముఖ్యమైన ఘట్టాలను మననం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో ఆచార్య జయశంకర్ పోషించిన పాత్ర మరువలేనిదని చెప్పారు. జయశంకర్ 1969 తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని చెప్పారు. తెలంగాణ ఉద్యమానికి వెన్నెముకగా ఆచార్య జయశంకర్ నిలిచారని పేర్కొన్నారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ కు తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో చక్కటి ప్రావీణ్యం ఉందని చెప్పారు. స్వరాష్ట్రం సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధి కొరకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించారని ఆ మహనీయుని ఆశయాల సాధన కోసం మనమంతా సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఓ శ్రీనివాసరావు, ఎస్సీ సంక్షేమ అధికారి అనసూయ, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ, జిల్లా పరిపాలన అధికారి గన్యా మరియు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో

## స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం



మెట్ పల్లి (గౌతమ్ న్యూస్)పట్టణం లో మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వాటర్ ట్యాంకులను క్లీన్ చేసి బ్లీచింగ్ వేయడం పరిసరాలను పరిశుభ్రంగా చేయడం వాటర్ క్లోరినేషన్ చేయడం జరిగింది పెద్ద చెరువును సందర్శించి ఇంకా చెరువు వద్ద అభివృద్ధి పనులను చేపట్టడానికి పరిశీలించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి మోహన్ డి ఈ నాగేశ్వరరావు టెక్నికల్ ఆఫీసర్ నరేష్ ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్ ఆర్ ఐ అక్షయ్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు ముజీబ్ ఇన్చార్జి పిట్టర్ నరసయ్య నిజాం అశోక్ నరేష్ మహేష్ శేఖర్ పాల్గొన్నారు



# వజ్రా బస్సుల సంగతి ఏమైంది సార్

## మూలకు పడ్డ వజ్ర బస్సులు




నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బస్సులు ఏవి అంటే వజ్ర బస్సులు ఆర్టీసీ రవాణా సంస్థ ప్రయాణికుల సౌకర్యం కోసం మినీ ఏసి బస్సులను ప్రవేశపెట్టింది ఇప్పుడు అట్టి బస్సులు ఆర్టీసీ సంస్థకు గుదిబండంగా మారాయి అసలు ఈ బస్సులు ఎందుకు కొనుగోలు చేశామని అధికారులు తలలు పట్టుకుంటున్నారు, 2017 సంవత్సరంలో ఆనాటి టిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వ హయంలో 40 కోట్ల రూపాయల వ్యయంతో వజ్రా బస్సులను కొనుగోలు చేశారు, ఇప్పటికే ఆర్టీసీ సంస్థలు గరుడ, గరుడ ప్లస్, రాజధాని పేర్లతోన ఆర్టీసీ సమస్త ఏసీ బస్సులను నడిపిస్తుంది, ఇది ఇలా ఉండగా అప్పట్లో ప్రభుత్వం మారుమూల ప్రాంతాలకు సైతం చిన్నచిన్న ఊర్ల మధ్యన గల్లీలలో సులభంగా తిప్పేందుకు వజ్ర బస్సుల పేరుతోనా మొత్తం 60 బస్సులను టిఆర్ఎస్ ప్రభుత్వం కొనుగోలు చేసింది, కానీ అట్టి వజ్రా బస్సులు అనేక కారణాల చేత ప్రస్తుతం ఆర్టీసీ సంస్థల్లో మూలుగుతూ తుప్పు పట్టిబోతున్నాయని విమర్శలు వస్తున్నాయి, కరోనా



సమయంలో వజ్ర బస్సులను ఆర్టీసీ బస్సులను నడిపించలేకపోయింది, అప్పటినుంచి ఇప్పటివరకు వజ్ర బస్సులు రోజురోజుకు తుప్పు పట్టి స్క్రాప్ కు అమ్మడానికి ఆర్టీసీ అధికారులు సిద్ధమైనట్లు తెలుస్తుంది, టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఆర్టీసీని మరింత బలోపేతం చేసి ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని లక్ష్యంతో ఈ బస్సులను కొనుగోలు చేశారు, ముందుగా ప్రధాన పట్టణాలతో నగరాలలో ఈ బస్సులను తిప్పినప్పటికీ ఆ తర్వాత కరోనా రావడంతో బస్సుల వాడగాని నిలిపివేశారు గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ సేవలు విస్తరించే దిశగా ఆర్థిక సంస్థ ప్రణాళికలు రచించినప్పటికీ సాధ్యం కాలేకపోయింది, చిన్న చిన్న ఊర్లు గల్లీలలో కూడా సులభంగా ఈ బస్సులు తిరగడానికి అవకాశం ఉన్నప్పటికీ అట్టి బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురాలేదు, ఈ వజ్ర బస్సులో ఎల్సిడి టీవీతోపాటు ఆటోమేటిక్ హైడ్రాలిక్ డోర్, ప్రతి పసుపు జిపిఆర్ఎస్ సిస్టం తో అన్ని హంగులతో ఆర్భాటంగా అప్పట్లో ప్రచారం చేసి టికెట్ ధరను అధికంగా పెట్టడం వల్ల ఈ బస్సులు అనుకున్న మీరు లక్ష్యాలను సాధించలేదు, ప్రయాణికులు కూడా వజ్ర బస్సులు ఎక్కడానికి మగ్గుచూపుని సందర్భంలో ఆర్టీసి యాజమాన్యం ఆ రోజుల్లో మితిమీరిపోతున్న కరోనా వైరస్ వల్ల ప్రభుత్వం ఈ బస్సులను నడిపించడానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడం మూలంగా ప్రస్తుతం వజ్రా బస్సులు ఎందుకు పనికిరాకుండా తుప్పు పట్టి పోతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి ఈ బస్సుల్లో సీటింగ్ కెపాసిటీ తక్కువ ఉండడం వల్ల చివరకు అద్దెకు కూడా ఎవరు తీసుకోవడానికి ముందుకు రాలేకపోతున్నారని తెలుస్తుంది ఈ బస్సులను వదిలించుకోవడానికి ఆర్టీసీ అధికార యంత్రాంగం సర్వ ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తుంది, వజ్ర బస్సుల కోసం ఓట్ల రూపాయల నిధులు ఖర్చుపెట్టిన అప్పటి ప్రభుత్వం ఆదాయానికి పొంతన లేకపోవడం వల్ల అవి ఆర్టిస్ట్ కి భారంగా మారాయి అప్పట్లో నష్టం వస్తే అతి బస్సులను అమ్మడానికి ప్రభుత్వం ఆదేశాలు కూడా జారీ చేసింది, తుప్పు పట్టిన వజ్ర బస్సులను ప్రస్తుతం ఆర్టీసీ అధికారులు స్క్రాప్ కు అమ్మడానికి సిద్ధమయ్యారు, ప్రస్తుతం ఈ బస్సులు ప్రజలకు ప్రయాణికులకు సౌకర్యం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర మంత్రులు స్పందించి నిరుపయోగంగా ఉన్న వజ్ర ఏసీ బస్సులను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందుబాటులోకి తక్కువ ధరకు టికెట్ వంటి అవకాశాన్ని కల్పిస్తూ ఈ బస్సులను రోడ్లపై తిప్పించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు, ఇప్పటికీ రాష్ట్రంలో మారుమూల ప్రాంతాలకు ఆర్టీసీ రవాణా సౌకర్యం లేక ప్రయాణికులు అష్ట కష్టాలకు గురవుతున్నారు, మరొక పక్క కార్గో సేవల కోసం ఈ బస్సులను ఉపయోగించుకోవడానికి అవకాశం ఉన్న కూడా ఆర్టీసీ అధికార యంత్రాంగం గత ప్రభుత్వం లో కొనుగోలు చేసిన ఈ బస్సుల పైన కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దలు ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు, చూడడానికి అందంగా అన్ని వసతులతో ప్రయాణికులకు ఎంతో ఉపయోగపరంగా వజ్ర ఏసీ బస్సులు ఉన్నప్పటికీ వాటిని వినియోగంలోకి తీసుకురావడంలో ఆర్టీసీ యంత్రాంగం ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని విమర్శలు వస్తున్నాయి, ఇప్పటికైనా నిరుపయోగంగా తుప్పు పట్టిబోతున్న వజ్ర ఏసి మినీ బస్సులను ప్రయాణికుల సౌకర్యం కోసం ఉపయోగించాలని ప్రయాణికులు కోరుతున్నారు,

## రైతుల సంఖ్య ఎక్కువ నిధుల విడుదల తక్కువ!!

## గందరగోళం మధ్య రుణమాఫీ!!

# సగం మందికి రుణమాఫీ !!

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు రుణమాఫీ పథకంలో గందరగోళ పరిస్థితి నెలకొన్నది, గత ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పిన హామీ ప్రకారం ప్రభుత్వం రుణమాఫీ ప్రక్రియను గత నెల 18 నుంచి



ఆర్భటంగా అమలు చేస్తున్నప్పటికీ మొదటి విడత రుణమాఫీలో రెండవ విట రుణమాఫీలో వివిధ బ్యాంకులలో రుణాలు తీసుకున్న రైతుల సంఖ్యకు అనుగుణంగా నిధులు విడుదల కాలేదని ఆయా బ్యాంకు అధికారులు అంటున్నారు, రైతుల సంఖ్య ఎక్కువ ఉన్నప్పటికీ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ తేదీ లోపు అన్ని అర్హతలు కలిగిన రైతులు రుణమాఫీకి ఎదురుచూస్తున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం అందులో సగం మందికి మాత్రమే రుణమాఫీ నిధులను బ్యాంకులకు జమ చేసింది, ప్రభుత్వం ముందుగా ప్రకటించిన లెక్కల ప్రకారం రుణమాఫీ కోసం 31 వేల కోట్ల రూపాయలు అవసరమవుతుందని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికి రెండు విడతల్లో కేవలం 12 వేల కోట్ల నిధులు మాత్రమే రైతుల ఖాతాలు జమ చేసింది, దీని బట్టి చూస్తే కేవలం మూడో విడత రుణమాఫీ రెండు లక్షల రుణం తీసుకున్న రైతుల సంఖ్య అందుకు అవసరమయ్యే నిధులు మహా అంటే పదివేల కోట్లు ఉంటాయి, మరి మిగతా ఎనిమిది వేల కోట్లు ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారం కనుమరుగైపోతున్నాయి, రాష్ట్రవ్యాప్తంగా 46 లక్షల మంది రైతులు పంట రుణాలు తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించింది, కానీ ఇప్పటివరకు కేవలం రెండు విడతల్లో 18 లక్షల



మంది రైతులకు మాత్రమే రుణమాఫీ నిధులు విడుదలయ్యాయి, ప్రభుత్వం ప్రకటించిన లెక్కల ప్రకారం ప్రభుత్వం ఇప్పటివరకు చేసిన మాఫీ లెక్కల ప్రకారం పొంతన లేకుండా పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు, మరోపక్క రేషన్ కార్డు లేకపోయినా రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు రేషన్ కార్డు లేని రైతులకు రుణమాఫీ చేయలేదు, అంతేకాక ప్రభుత్వ ఉద్యోగులకు కూడా రుణమాఫీలో కొర్రీలు పెట్టింది, వీటితోపాటు అన్ని అర్హతలు ఉండి అతి పేద రైతు అయినా కూడా రుణమాఫీ కాని వాళ్ళు చాలామంది ఉన్నట్లు గ్రామాలలో ఎక్కడ చూసినా చర్చనీయాంశంగా మారింది, రుణమాఫీ విషయంలో బ్యాంక్ అధికారులు ప్రభుత్వానికి




పంపిన రైతుల జాబితా వివరాలు ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల వివరాలు పరిశీలిస్తే ఇప్పటివరకు సగానికి సగం మందికి మాత్రమే మాఫీ వర్తించింది మిగతా రైతులు ఏమి పాపం చేశామని అంటున్నారు, ప్రభుత్వం పెట్టిన కండిషన్లు, కొర్రీలు, షరతులు రైతులకు పెను భారంగా మారింది, రైతు రుణమాఫీ తో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం గృహలు జ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు విద్యుత్తును ఉచితంగా ఎలాంటి బిల్లు చెల్లించకుండా ప్రజలు కరెంటును సద్వినియోగం చేసుకునే అవకాశం కల్పించింది, కానీ గృహజ్యోతి పథకంలో కూడా లబ్దిదారులు జీరో బిల్లు రాక ఆందోళన చెందుతున్నారు, గృహజ్యోతి పథకంలో తప్పుడు తడకలు లబ్ధిదారుల ఎంపికలో డేటా ఎంట్రీలో జరిగిన తప్పుల వల్ల వినియోగదారులు కరెంట్ బిల్లులు భరించలేకపోతున్నారు, ఈ గృహ జ్యోతి పథకం గురించి ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు దాదాపు 6 నెలల నుంచి కరెంటు బిల్లు చెల్లించకుండా ఉన్నాను వినియోగదారుల నుంచి విద్యుత్ శాఖ అధికారులు కొరడా కుల్పిస్తూ బిల్లులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి, అంతేకాక ఇందిరమ్మ ఇల్లు కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు ప్రభుత్వం ఇప్పుడు అప్పుడు అంటూ నాలుగు లక్షల 50 వేల ఇల్లు ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పున మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిన కూడా ఇప్పటికీ ఆచరణలో అమలు కాలేదు, వీటితోపాటు ప్రతి మహిళకు నెలకు ?2,500 చేయూత పథకం ద్వారా అందజేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు, అంతేకాక రైతు భరోసా పథకం కింద ఎకరాకు 7500 గత యాసంగి సీజన్ నుంచి అమలు చేయాల్సింది కానీ యాసంగి సీజన్ పూర్తి అయి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ కూడా




ఇప్పటివరకు రైతు భరోసానిధుల విడుదలలో ప్రభుత్వం సమాలోచనలు చేయడం ఎంతవరకు సమంజసం అని రైతుల అంటున్నారు, కమిటీల పేరుతో నా కాలయాపన చేస్తూ రైతులకు పెట్టుబడి సహాయాన్ని సకాలంలో అందించలేని ప్రభుత్వం వ్యవసాయ సీజన్ పూర్తయిన తర్వాత మొక్కుబడిగా పాత పద్ధతిలో నిధులు విడుదల చేయడానికి కుట్ర చేస్తుందని విమర్శలు ఉన్నాయి, రైతు భరోసాతో పాటు, మహిళలకు ఆసరా పెన్షన్ కూడా పెంచుతూ వెంటనే ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ప్రజల డిమాండ్ చేస్తున్నారు, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పిందని చెప్పడంలో సందేశం లేదు, కొంత ఆలస్యమైనా పథకాలు కొర్రీలు పెట్టకుండా షరతులు పెట్టకుండా వెంటనే అమలు చేయాలని, ముఖ్యంగా రుణమాఫీలో జరుగుతున్న మోసాలు ప్రజలు ఇప్పటికే గమనించారని, ఈ రుణమాఫీ విషయంలో రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలైన బిజెపి, టిఆర్ఎస్ పార్టీలు రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించినందుకు సోషల్ మీడియాలో వాట్సాప్ ఇన్స్టాగ్రామ్, తదితర వాటి ద్వారా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు, అసలు విషయము మరికొన్ని రోజుల్లో బయటపడనుంది,

# కేరళ వయినాడ్ వరద బాధితులకు చేయూతనివ్వండి

## సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారధి రెడ్డి పిలుపు

మానుకోట జిల్లా (గౌతమ్ న్యూస్): రెండవ రోజు సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో విరాళాల సేకరణ మంగళవారం మహబూబాద్ జిల్లా కేంద్రంలో కేరళ వయినాడ్ వరద బాధితులకు



సహాయార్థం సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారధి రెడ్డి ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు మున్సిపాలిటీ మరియు పాత బజారులో విరాళాలు విస్తృతంగా సేకరించారు. ఈ సందర్భంగా సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం గొప్పతనం అని, మానుకోట ప్రజలు చైతన్య వంతులు అని గత రెండు రోజులుగా సిపిఐ చేస్తున్న విరాళాల సేకరణకు కేరళవయినాడ్ వరద బాధితులకు ప్రతి ఒక్కరూ



తమవంతుగా ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. దేశ ప్రజలందరూ కేరళ రాష్ట్రంలోని వైనాడు ను ఆదుకోవాలని, సినీ తారలు వ్యాపారస్తులు రాజకీయ నాయకులు కార్పొరేట్ సంస్థలు స్వచ్ఛంద సంస్థలు అన్ని వర్గాల ప్రజలు ముందుకు వచ్చి కేరళ వరద బాధితులను ఆదుకోవాలని, ఈ సందర్భంగా ఎవరికి కష్టం వచ్చినా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వారి పక్షాన ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, వార్డు కౌన్సిలర్లు పోతురాజు, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, సువర్ణపు సోమయ్య, దౌలగర్ శంకర్, చింతకుంట్ల వెంకన్న, వెలుగు శ్రావణ్, మా లోతు రవీందర్, ఆబోతు అశోక్, జలగం ప్రవీణ్, హర్షవర్ధన్ బోల్ల భద్రయ్య, జూలకంటి వేణు, తోట రవి, గుంటోజు రమేష్ పాల్గొన్నారు.

# తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కారం

### తండా ధర్మారంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

### తండ ధర్మారం స్పెషల్ ఆఫీసర్ ప్రవీణ్



మహబూబాబాద్ /(మరిపెడ/**(గౌతమ్ న్యూస్):** మానుకోట జిల్లా మరిపెడ మండలం తండ ధర్మారం గ్రామ పంచాయితీ అంగన్వాడీ కేంద్రాల్లో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు స్పెషల్ ఆఫీసర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్పెషల్ ఆఫీసర్ ప్రవీణ్ మాట్లాడుతూ పుట్టిన గంటలోపు పిల్లలకు ముర్రుపాలు తాగించడం వలన పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, అంటే తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా అని, జీవితాంతం అనేక వ్యాధుల నుండి కాపాడుతుందని, అంతేకాక తల్లిపాలు బిడ్డ ఎంత ఎక్కువ తాగితే అంత బాగా తెలివితేటలు వృద్ధి చెందుతాయన్నారు. ప్రపంచంలో తల్లి పాలకు ప్రత్యామ్నాయం లేదని తల్లిపాలు అత్యంత విశిష్టమైనవని, బిడ్డ పుట్టిన మొదటి గంటలో తల్లి నుంచి వచ్చే ముర్రుపాలు అమృతంతో సమానమన్నారు. పిల్లలకు విద్యాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పంచాయతీ కార్యదర్శి విజయ, అంగన్వాడీ టీచర్లు బి.సుశీల, ఏ.నాగచంద్ర, డి.రోజా, తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి బావులు బ్రిచింగ్, వాటర్ ట్యాంక్స్ శుభ్రం చేయించిన

### మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న



మానుకోట జిల్లా **(గౌతమ్ న్యూస్):** మహబూబాబాద్ పురపాలక సంఘం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా24 వ వార్డు యందు మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న ఆధ్వర్యంలో రెండవ రోజు వార్డు పరిధిలోని లెనిన్ నగర్, ఇందిరానగర్, తీగల సత్యనారాయణ కాలనీ, వడ్డెర కాలనీ, నరసింహనగర్ కాలనీలలో మంచినీటి బావులు బ్రిచింగ్ చేయడం, మరియు జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజ్ ట్రైబల్ బాయ్స్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్, అర్టికల్చర్ కాలేజ్, నందమూరి స్కూల్, ఇందిరా నగర్, స్కూల్ యందు వాటర్ ట్యాంక్స్ శుభ్రం చేయించడం జరిగింది. కాలేజీల పాఠశాలల ఉపాధ్యాయులకు వర్షాకాలం దృశ్య మంచినీటి ట్యాంకుల్ని శుభ్రంగా ఉంచుకోవాల్సిందిగా తెలియజేయడం జరిగింది. మరియు స్కూల్ ఆవరణలో కాలేజీ ఆవరణలో ఆఫీసులో ఆవరణలో నీరు నిలవకుండా ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా చెప్పడం జరిగింది. కాలనీలోని ఇండ్లలో ఉన్న మంచినీటి బావిలో బ్లీచింగ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ నాగేశ్వర్ రావు, మార్నేనికిరణ్, గుర్రాల శీను, ఆర్.పి సాబీర్, అంగన్వాడీ టీచర్స్ రమాదేవి, కాలనీవాసులు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి

### అక్రిడిటేషన్ల జారీలో హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం ...టీఎస్ జెయు




మానుకోట/వరంగల్/**(గౌతమ్ న్యూస్):** అన్ని పత్రికలతో సమానంగా చిన్న పత్రికలకు సైతం అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని హైకోర్టు ధర్మాసనం తీర్పు నివ్వడాన్ని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్ జెయు) స్వాగతించింది. ఈ మేరకు నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) ఎన్ యుజెఐ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్. పురుషోత్తం, టీఎస్ జెయు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మెరుగు చంద్రమోహన్, తోకల అనిల్ కుమార్, కోశాధికారి పాపాని నాగరాజు లు మాట్లాడుతూ టీఎస్ జెయు, టిజెఎ, టిజెజెఎసిల ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా అక్రిడిటేషన్ల జారీ కోసం ప్రభుత్వం జారీ చేసిన 239 ఉత్తర్వులలో లోపాలను ఎత్తిచూపుతూ జీవోను రద్దు చేయాలని కోరుతున్న విషయం విధితమే. గత ప్రభుత్వం జారీ చేసిన ఈ ఉత్తర్వులు జర్నలిస్టుల హక్కులను కాలరాసే విధంగా ఉందని వారు అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అర్హులైన జర్నలిస్టులందరికీ న్యాయం చేస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా చిన్న పత్రికలలో పనిచేసే జిల్లా, నియోజకవర్గస్థాయి జర్నలిస్టులకు మీడియా అక్రిడిటేషన్ (ప్రభుత్వ గుర్తింపు కార్డులు) ఇవ్వకుండా దూరం పెట్టడం చెల్లదని హైకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్ 2016 లోని షెడ్యూల్ 'ఈ' ను హైకోర్టు కొట్టు వేయటం అభినందనీయమన్నారు. చిన్న పత్రికలను నాలుగు విభాగాలుగా విభజించడం చెల్లదని కోర్టు తీర్పు ఇచ్చిందని అన్నారు. చిన్న పత్రికల్లో పనిచేసే జర్నలిస్టులను ఏబిసిడి కేటగిరీలుగా విభజించడం సరైనది కాదని కోర్టు అభిప్రాయపడినట్లు వారు తెలిపారు. ఈ మేరకు హైకోర్టు ధర్మసనానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

## టేకులపల్లి మండలం పరిషత్ ప్రత్యేక అధికారిగా

# బాధ్యతను స్వీకరించిన కే శ్రీ రామ్



టేకులపల్లి **(గౌతమ్ న్యూస్):** టేకులపల్లి మండల ప్రజా పరిషత్ పాలకవర్గం పదవీ కాలం 5 సంవత్సరములు సోమవారంతో ముగియడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధి కల్పన అధికారి కే. శ్రీరామ్ ను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశానుసారంగా టేకులపల్లి కి ప్రత్యేక అధికారిగా నియమించడం తో మంగళవారం ఆయన పదవి బాధ్యతలు చేపట్టారు, అనంతరం ఎంపీడీవో రవీందర్ రావు మరియు ఎంపీ ఓ గాంధీ పంచాయతీ కార్యదర్శి తో కలిసి సులానగర్ లో ,"స్వచ్ఛద నం పచ్చదనం" కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పరిశీలించి ఉపాధ్యాయు లతో కలిసి శ్రమదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో. పంచాయతీ కార్యదర్శి ఎన్ పవిత్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన

### చిన్న గూడూరు మండల ఎం.పీ డిఈఓ ఎమ్.రామారావు



మానుకోట /చిన్న గూడూరు/**(గౌతమ్ న్యూస్):** మానుకోట జిల్లా చిన్న గూడూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన తెలంగాణ స్వరాష్ట్ర స్వాప్నికుడు, సిద్ధాంతకర్త, ఉద్యమ భావజాల వ్యాప్తికి జీవితాంతం కృషి చేసిన మహనీయులు ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన చిన్న గూడూరు మండల ఎం.పీ డిఈఓ ఎమ్.రామారావు, జిల్లా డి.డబ్ల్యు.ఓ, చిన్న గూడూరు మండల స్పెషల్ ఆఫీసర్ వరలక్ష్మి, చిన్న గూడూరు మండల సేవలాల్ సేన సంఘం అధ్యక్షులు బాధావత్ సురేష్, ఉగ్గంపల్లి గ్రామ బీఆర్ఎస్ నాయకులు కొమురెల్లి, ఉన్నతాధికారులు తిరుమలరావు, మేరీ, కంప్యూటర్ ఆపరేటర్, సుమన్, బోర్ మెకానిక్ జాఫర్, అటెండర్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్ట్ 10 నుండి 25 వరకు జరిగే బోధ వ్యాధి నిర్మూలన మాత్రల పంపిణీ కార్యక్రమం విజయవంతం చేయండి

### జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.కళావతి బాయి



మానుకోట జిల్లా **(గౌతమ్ న్యూస్):** జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో మహబూబాబాద్ జిల్లాను అగ్రబాగానా ఉంచాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.కళావతి బాయి పేర్కొన్నారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులతో జరిపిన సమీక్షా సమావేశంలో కళావతి బాయి మాట్లాడుతూ ఆగస్ట్ 10 నుండి 25 వ తేదీ వరకు గంగారం, కోమట్లగూడెం, కొత్తగూడ, గంధంపల్లి, ముల్కనూరు మరియు బయ్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరిగే బోధ వ్యాధి నిర్మూలన మాత్రల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా జరిగేలా చూడాలని ప్రోగ్రాం అధికారులకు సూచనలు జారీ చేశారు. ప్రతి నెలలో జరిగే ఆశా మీటింగ్లకు ప్రోగ్రాం అధికారులు విధిగా హాజరై తమకు సంబంధించిన కార్యక్రమాల అమలుపై విశ్లేషించి, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన పెంపొందించాలని పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లాలో సిజేరియన్ కాన్పుల శాతం ఎక్కువగా ఉందని ఆందోళన



వ్యక్తపరుస్తూ తల్లుల సమావేశంలో నార్మల్ డెలివరీ పై అవగాహన కల్పించాలని, దానికి తగినట్లుగా గర్భిణిగా ఉన్నప్పుడు యోగా నేర్పించాలని ముఖ్యంగా మొదటి సారి గర్భం దాల్చిన స్త్రీల యొక్క ఇంటిలోని పెద్దవారికి నార్మల్ డెలివరీ వల్ల కలిగే లాభాల పైన అవగాహన కలిపించాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో ఇచ్చే మందులను ఉపయోగించుకునేలా చూడాలని, ఎన్.సి.డి ప్రోగ్రాంలో భాగంగా అందరినీ ఫాలోఅప్ చేసి మందులు వాడేలా చూడాలని పేర్కొన్నారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను జిల్లా వైద్య ఆరోగ్య శాకాధికారి అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. అదేవిదంగా బోదకాలు నివారణ అర్థం మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేటివ్, ఆగస్టు పదో తారీకు నుంచి ఆగస్టు 25వ తారీకు వరకు జరుగు ప్రోగ్రామ్ లో భాగంగా పది నుంచి 12వ తారీకు వరకు బూతు లెవెల్, 13వ తారీకు నుంచి 22వ తారీకు వరకు ఇంటింటికి సందర్శించి మాత్రం వేయటం, 23 నుంచి 25 వరకు ఎవరైతే మిస్ అయ్యారో వారికి మాత్రలు మింగించడం జరుగుతుంది. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధీర్ రెడ్డి, డబ్ల్యుహెచ్వో కన్సల్టెంట్ డాక్టర్ శిరీష, బయ్యారం, గంధంపల్లి, ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ను సందర్శించి వారికి ఐ.ఈ.సి మెటీరియల్ అందజేసి, యాక్షన్ ప్లాన్ ప్రకారం బోధ వ్యాధి నివారణ కొరకు సామూహిక మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరడం జరిగింది. ఈ సమావేశములో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ మురళీధర, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మి నారాయణ, డాక్టర్ శ్రవణ్, డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, డాక్టర్ జాదవ్, డిపిఎంఓ రవీందర్, సూపరింటెండెంట్, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ రాజ్కుమార్, డాక్టర్ సాగర్, హెల్త్ ఎడ్యుకేటర్ పురుషోత్తం, సబ్ యూనిట్ ఆఫీసర్ ఓబిలిశెట్టి రామకృష్ణ, సి.హెచ్.ఓ సక్కుబాయి, వలి, పి.హెచ్.ఎన్ కళావతి, సూపర్వైజర్లు ఇస్మాల్, కృష్ణ చైతన్య, వాహిద్ అలీ, వాణి, రాజు, గోవర్ధన్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టు కార్యాలయాలు పోరాట కేంద్రాలుగా ఉండాలి

### రౌడీయిజం, అవినీతి, అహంభావం పెరిగితే పతనం తప్పదు

### సిపిఐ జాతీయ కార్యదర్శి డా.కె. నారాయణ.




భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి**(గౌతమ్ న్యూస్):** కొత్తగూడెం : కమ్యూనిస్టు కార్యాలయాలు పోరాట కేంద్రాలుగా విలసిల్లాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ అన్నారు. చుంచుపల్లి మండల సిపిఐ కార్యాలయాన్ని (రజబ్ అలి భవన్)ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఐ జెండాను ఎగురవేశారు. ఇందులో భాగంగా రజబ్ అలి భవన్ కార్యదర్శి కార్యాలయన్ని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, చంద్ర సత్యం సమావేశ మందిరాన్ని ఏఐటియూసి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియ్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనతంరం జరిగిన సభలో నారాయణ మాట్లాడుతూ రజబ్ అలీ కాలం నాటి రాజకీయాలకు, ప్రస్తుత రాజకీయాలకు ఎంతో




వ్యత్యాసం ఉందన, పవిత్రమైన రాజకీయాలు నేడు అపహాస్యం పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. దేశంలో నరేంద్రమోడి బ్లాక్మెయిల్ రాజకీయాలకు తెరలేపారని, బెదిరింపులకు పాల్పడుతూ పాలన సాగిస్తున్నారన్నారు. మొన్న ముగిసిన పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు వస్తాయని ప్రగల్బాలు పలికిన బిజేపికి కేవలం 240సీట్లే వచ్చాయని, ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సంఖ్యా బలం లేకున్నప్పటికీ ఏపిలో తెలుగుదేశం పార్టీ చంద్రబాబుతో, బిహార్లో సమాజ్వాద్ పార్టీ నితీష్ కుమార్తో జతకట్టి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారని, దేశ చరిత్రలో నరేంద్రమోడీ అతి తక్కువ ఓట్లతో గెలిచిన రెండో ప్రధానిగా చరిత్ర పుటల్లోకి ఎక్కారని యద్దేవా చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ వారికే అనుకూలంగా ఉందని, అంబాని, అదానీలకు కావాల్సిన రీతిలో పద్దును తీర్చి దిద్దారని, సంపన్న వర్గాల వ్యాపారవేత్తలకు జీఎస్టి 33 శాతం నుండి 22 శాతానికి తగ్గించి, పేదలు వాడుకునే చెప్పులపై ఉండే 5 శాతం జీఎస్టిని 18 శాతానికి పెంచారని మండిపడ్డారు. ఇది ముమ్మారిటకీ పెద్దల పద్దే అని, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారాం పవిత్రమైన పార్లమెంట్ సాక్షిగా అన్ని అబద్ధాలే చెబుతున్నారని మండిపడ్డారు. రౌడీయిజం, అవినీతి, అహంభావం పెరిగిపోతే రాజకీయ పతనం తప్పదని, తెలంగాణ, ఏపిల్లో అచ్చం అదే జరిగిందన్నారు. తమకు ఎదురేలేదని, ప్రతిపక్షాలను గౌరవించకుండా తూలనాడిన కేసిఆర్, జగన్ను ప్రజలు ఇంటికి పంపారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి అసెంబ్లీకి అడుగుపెట్టకుండా కేసిఆర్ చేస్తే ఇప్పుడు సీన్ తిరగబడి కేసిఆర్ ఓ మూలకు కూర్చునే పరిస్థితి వచ్చిందన్నారు. సిపిఐకి కొత్తగూడెం అసెంబ్లీ సీటు కావాలని అడిగితే పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొత్తగూడెం నుండి పోటీ చేసి గెలిస్తే తనముఖం చూస్తు ఉండలేనని సీటు, ఇవ్వలేనని తేల్చి చెప్పారని, కానీ ఇప్పుడు కేసిఆర్ ముఖమే కనబడకుండా పోతోందని అన్నారు. ప్రతిపక్షాలను అగౌరవ పరిచే సాంప్రదాయాన్ని మానుకోవాలని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తప్పిదాన్ని చేస్తోందని, తీరుమార్చు కోవాలని సూచించారు. పదవులు ఎవరికీ శాశ్వతం కాదని, ప్రజా తీర్పుకు ఎవరైనా కట్టుబడి ఉండాల్సిందే అని చెప్పారు. ఎలాంటి పదవులు లేకున్నా కమ్యూనిస్టులు నిత్యం ప్రజలతోనే ఉంటారని చెప్పారు. దేశంలో నానాటికీ పెరిగిపోతున్న విపత్కర పరిస్థితులను చూస్తున్న ప్రజలు ఇప్పుడిప్పుడే కమ్యూనిస్టుల ఆవసరాన్ని గుర్తిస్తున్నారని, పవిత్రమైన రాజకీయ వ్యవస్థను కాపాడుకునేందుకు కమ్యూనిస్టులుగా పోరాటాలను మరింత పదునుపెట్టాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సుమారు 40 ఏళ్ల పాటు ఈప్రాంతం కమ్యూనిస్టుల కంచుకోటని, తాను కొత్తగూడెం వచ్చిన తొలినాళ్ల నుండి ఇప్పటి వరకు ఈ ప్రాంత ప్రజలు కమ్యూనిస్టు పార్టీని అండదండగా ఉన్నారని తెలిపారు. ఎన్నో పోరాటాలు, నిర్బంధాలు, జైళ్లు, అనిచివేతలను తట్టుకుని నిలబడ్డామని, మొదట్లోఈ కార్యాలయాన్ని రేకుల షెడ్లో ఏర్పాటు చేసుకుని, ఇప్పుడు సరికొత్త హంగులతో నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని, భవోద్వేగాన్ని కలిగిస్తోందన్నారు. కొత్తగూడెం నియోజవర్గంలోని ప్రతీ అభివృద్ధిలో సిపిఐ కృషి ఉందని, ఇప్పుడు మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం లభించిందని, కనీవినీ ఎరుగని రీతిలో శాశ్వత అభివృద్ధికి బాటలు వేసుకుందామని, అందుకు అడుగులు కూడా పడ్డాయని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడే పార్టీల మనుగడ శాశ్వతమని, తమకు పదవుల కంటే ప్రజా శ్రేయస్సు ముఖ్యమని కూనంనేని స్పష్టం చేశారు. సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం,ఖమ్మం జిల్లాల కార్యదర్శులు ఎస్ కె సాబీర్ పాషా, పోటు ప్రసాద్, వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి శీతారామయ్య, కే. రాజ్ కుమార్ సభలో మాట్లాడారు. సిపెచ్ మాధవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, చంద్రగిరి శ్రీనివాసరావు, నరాటి ప్రసాద్, దుర్గరాశి వెంకన్న, వాసిరెడ్డి మురళీ, పూర్ణచంద్రరావు, ఏ సాయిబాబు, బి కేశవరావు, కంజర్ల జమలయ్య, భానోత్ గోవింద్, పోలమూరి శ్రీనివాస్, వి. పద్మజ, కే రత్నకుమారి, ఉదయ్ భాస్కర్, ధనలక్ష్మీ, గెద్దాడి నగేష్, దీటి లక్ష్మీ పతి, బండి నాగేశ్వరరావు, భూక్యా శ్రీనివాస్, సుధాకర్, ఫహీమ్, బరిగెల భూపేష్,చంద్ర పూర్ణ, చంద్ర మధు, విజయలక్ష్మీ, వివిధ పార్టీల నాయకులూ ఎంవి చౌదరి, నాగసీతారాములు, కనగాల అనంతరాములు, పాల్, కూసపాటి శ్రీను, మద్దెల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం ఏరియాలోని భూ నిర్వాసితులకు ఇంటి స్థలాలు కేటాయించడం జరిగింది

### ముఖ్యఅతిథిగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని పాల్గొని భూమి పూజ చేశారు.

భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి**(గౌతమ్ న్యూస్):** కొత్తగూడెం: సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని మాయాబజార్, వనమా నగర్, ఎస్.ఆర్.టి క్వార్టర్స్ మరియు గొల్లగూడెం లోని రైల్వే భూ నిర్వాసితులకు కేటాయించిన ఇంటి స్థలాల భూమి పూజ కార్యక్రమం కొత్తగూడెం ఏరియాలోని మాయాబజార్ వనమా నగర్ ఎస్.ఆర్. టి క్వార్టర్స్ మరియు గొల్లగూడెం లోని రైల్వే భూ నిర్వాసితులకు కొత్తగూడెం గ్రామం సర్వేనెంబర్ 143 లోని భూమిని 347 మందికి ఒక్కొక్కరికి 100 చదరపు గజాల స్థలం చొప్పున ఇంటి స్థలాల పట్టాల పంపిణీ చేయడం జరిగింది. ఈరోజు మంగళవారం 06-08-2024 నసుమారు 30 మంది వారికి కేటాయించిన స్థలములలో ఇంటిని నిర్మించుకొనుటకు భూమి పూజ కార్యక్రమంను నిర్వహించారు ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు కునంనేని సాంబశివరావు పాల్గొనడం జరిగినది. ఈ యొక్క కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా సింగరేణి




జనరల్ మేనేజర్ ఎం.షాలెం రాజు మరియు కొత్తగూడెం ఏరియా నుండి ఎస్ఓటు జిఎం జీ.వి.కోటిరెడ్డి, ఎజిఎం (సివిల్) సిహెచ్.రామకృష్ణ, జీకేఓసి పిఓ శ్రీ రమేష్, సీనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్ తౌర్య నాయక్ నాయక్, కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, మరియు మాయాబజార్, వనమా నగర్, రుద్రంపూర్ సర్పంచ్ లు మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# లింకు ఓపెన్ ...మీ డబ్బు మాయం..

నల్లబెల్లి (గౌతమ్ న్యూస్): మండల కేంద్రానికి చెందిన మధు స్థానికంగా శీతల పానీయాల ఏజెన్సీ నిర్వహిస్తున్నారు ఈనెల 4న ఆయనకు వాట్సాప్ లో యూనియన్ బ్యాంకు పేరుతో ఫైల్ వచ్చింది ఆయన ఫైల్ తెరవగా ఆయన బ్యాంకు ఖాతా నుంచి రూ.17, 541 విత్ డ్రా చేసినట్లు సందేశం రావడంతో ఆశ్చర్యపోయాడు ఆ ప్రమతమై తన ఖాతాలో ఉన్న మిగిలిన మొత్తాన్ని కుటుంబ సభ్యులకు పంపించాడు అనంతరం 1 9 3 0 నంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినట్లు మధు సోమవారం తెలిపారు సైబర్ మోసాల బారిన పడి డబ్బులు పోగొట్టుకున్న వారు మొదటి గంటలోనే (గోల్డెన్ అవర్) ఫిర్యాదు చేయాలని రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో(TSCSB) సూచించింది ఇలా చేస్తే నేరగాళ్లకు డబ్బు చేరకుండా ఆపగలమని తెలిపింది లీగల్ సర్వీసెస్ అథారిటీ సహకారంతో TSCSB మార్చి-జూలై మధ్య రూ.85.05 కోట్ల నగదును రిఫండ్ చేసింది మొత్తం 6,445 కేసులను పరిష్కరించింది బాధితులు 1930 నెంబర్,,cybercrime.gov.in లో ఫిర్యాదు చేయవచ్చు . సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని లింకులను ఓపెన్ చేయవద్దని పలువురు సూచిస్తున్నారు..

# దవాఖానలో పండ్ల పంపిణీ





నల్లబెల్లి (గౌతమ్ న్యూస్): నర్సంపేట అభివృద్ధి ప్రదాత మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి గారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నల్లబెల్లి మండల కేంద్రం బస్టాండ్ ఆవరణలో మండల పార్టీ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించగా మండల పార్టీ అధ్యక్షులు డాక్టర్ బానోత్ సారంగపాణి మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి గారి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు అలాగే నల్లబెల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ చేయడం జరిగింది. తదనంతరం మండల పార్టీ కార్యాలయంలో తెలంగాణ జాతిపిత ఉద్యమకారుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతినీ పురస్కరించుకొని వారి చిత్రపటానికి పూలమాలలు అలంకరించి జన్మదిన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈట్టి కార్యక్రమంలో నల్లబెల్లి మండల బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్తపెల్లి కోటిలింగచారి,క్లస్టర్ ఇంచార్జ్ గందే శ్రీనివాస్ గుప్తా, ఇంగ్లీ శివాజి, బోట్ల పవన్, ప్రచార కార్యదర్శి గండు శ్రీధర్, గుమ్మడి వేణు ప్రజాప్రతినిధులు,అన్నీ గ్రామల పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు ముఖ్య కార్యకర్తలు వివిధ సంఘాల అధ్యక్షులు కార్య దర్శిలు కమిటీ మెంబర్లు మరియు వివిధ గ్రామాల నుండి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై పుట్టినరోజు దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది.

## రహదారుల పై గుంతలు పూడ్చడానికి కోల్డ్ మిక్స్ ఉపయోగం

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : కొత్తగూడెం మేన్ రోడ్డుపై ఉన్న గుంతలను పుడ్చుడానికి ట్రాఫిక్ కు అంతరాయము లేకుండా 10 నిమిషాల్లో గుంతలను పుడ్చే రేడిమెడ్ కోల్డ్ మిక్స్ ను కొత్త గూడెం జిల్లా లో మొదటగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పురపాలక సంఘం కొత్తగూడెం ద్వారా తీసుకోని వచ్చి మొదటగా అండర్ బ్రిడ్జి క్రింద వర్షాకాలంలో గుంతలు ఏర్పడి నీరు నిలవడం వల్ల ప్రజలకు రాకపోకలు ఇబ్బందులు పడుతున్న గుంతను ఈ రోజు ఉదయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ గారి సమక్షంలో పుడ్పించనైనది. జిల్లాలోని రహదారులపై గుంటలు లేకుండా ఏర్పాటు చేసే కార్యక్రమం మొదట కొత్తగూడెం మున్సిపాలిటీ నుండి కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మరియు మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమిషనర్ శేష మరియు స్థానిక కౌన్సిలర్స్, మున్సిపాలిటీ డి ఈ రవి మరియు సానిటేషన్ ఇన్స్పెక్టర్లు చారీ,చవాన్, జవానులు నవీన్,రవి పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ సేవలు మరువ లేనివి

### సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): సింగరేణి భవన్, జులై 6, 2024 న ప్రొఫెసర్ జయశంకర్ అడుగు జాడల్లోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని.. అలాగే ఆయన చూపిన మార్గంలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడానికి అందరం సమష్టిగా కృషి చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో జరిగిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథి గా మాట్లాడారు. తొలి దశ ఉద్యమం నుంచి మలి దశ పోరాటం వరకు ఆయన చేసిన భావజాల వ్యాప్తి, చూపించిన స్ఫూర్తి అందరికీ ఆదర్శమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆయన చేసిన సేవలు మరువలేవన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మినిమమ్ వేజెస్ అడ్వైజర్ బోర్డు ఛైర్మన్ జనక్ ప్రసాద్, డైరెక్టర్(పి అండ్ పి) జి.వెంకటేశ్వరరెడ్డి, జీఎం(కో ఆర్డినేషన్) జి.దేవేందర్, జీఎం(పి అండ్ పి) సాయిబాబు, జీఎం ఎన్.వి.రాజశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా రేణుక మాతా అభిషేకం....





మెదక్ (గౌతమ్ న్యూస్): రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో పంటలు సుభిక్షంగా పండి అందరు చల్లగా ఉండాలని పాల్వంచ మంగమ్మ సత్యనారాయణ గౌడ్ దంపతులు కోరుకున్నారు . అమ్మను నమ్ముకుని చేసిన పనులుసత్ఫలితాలనిస్తాయని పేర్కొన్నారు. మండల కేంద్రం కొల్చారంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తృతీయ వార్షికోత్సవము అనంతరం 31 వ మంగళవారం నాడు శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పాల్వంచ మంగమ్మ సత్యనారాయణ గౌడ్ దంపతులచే శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో అభిషేక,అలంకరణ, అర్చన కార్యక్రమం నిర్వహించగా కోలాచాలకృష్ణ శర్మ మంత్రోచ్ఛహరణల మధ్య ఘనంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు .ఈ కార్యక్రమంలో,రామకృష్ణ గౌడ్, అశోక్ గౌడ్,లక్ష్మి నారాయణ గౌడ్,శేఖర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్,పాప గౌడ్,యాదగౌడ్,దుర్గపతి గౌడ్,సుధాకర్ గౌడ్, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# కౌడిపల్లి గిరిజన గురుకుల కళాశాలలో...

## ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు...



మెదక్,(గౌతమ్ న్యూస్): తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సర్ 90వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం రోజున మెదక్ జిల్లా మండల కేంద్రమైన కౌడిపల్లిలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల(పాఠశాల)లో కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా జయశంకర్ సర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.ఫణికుమార్ మాట్లాడుతూ " తెలంగాణ రాష్ట్రం అనే ఆలోచనకు బీజం వేసిన



ఆచార్య జయశంకర్ సర్ తన ఇంటర్మీడియట్ స్థాయి నుండి ఉద్యోమాలలో పాల్గొన్నారని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను ముందుగా గుర్తించి పలు పుస్తకాలను రచించి తెలంగాణ సమాజాన్ని జాగృత పరచిన వైతాళికుడని, గురువుగా విద్యార్థులకు పాఠాలను బోధించడం మాత్రమే కాదు, సమాజాన్ని సైతం అత్యంత ప్రభావితం చేసిన మహనీయుడని, ఆయన ఉపాధ్యాయులుగా, ఆచార్యులుగా, రిజిస్ట్రార్గా, వైస్ ఛాన్సలర్ వంటి ఎన్నో పదవులు చేపట్టి తన ఊపిరి ఉన్నంత వరకు తెలంగాణ కోసమే కృషి చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన జీవితం నుంచి విద్యార్థులు స్ఫూర్తి పొంది సమాజానికి సేవ చేయాలని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.నర్సింహా మాట్లాడుతూ "ప్రొ. జయశంకర్ సర్ చిన్ననాటి నుండే ఉద్యోమాలలో చురుగ్గా పాల్గొన్నారని, నాన్ ముల్కి ఉద్యమం, ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ ఉద్యమం, విశాలాంధ్రకు వ్యతిరేకంగా జరిపిన ఉద్యమంలో, 1969 తొలిదశ ఉద్యమంలో, 20వ దశకం మలి దశ ఉద్యమంలో పాల్గొనడమే కాదు ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచారని, సభలు, సమావేశాలలో 'అబ్ తో ఏక్ హీ ఖ్వాయిష్ హై, వో తెలంగాణ దేఖ్ నా ఔర్ మర్ జానా, వెట్టికి మట్టికి మనమే ఉండాలి' వంటి నినాదాలతో, తెలంగాణ ప్రజల్లో చైతన్యం కల్పించారని" అన్నారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పూర్వ ప్రిన్సిపాల్ షాలిని, అధ్యాపకులు బి.మంజుల, పి.భరత్, యు.రజిత, డి.కొండల్ రెడ్డి, దీక్ష, విజయ, సునంద, ఉదయ్, ఉపేందర్, స్రవంతి, బాబు లాల్, రమేష్, దశరథ్,



రవి, మహేశ్వర్, లక్ష్మీ, ఆంజనేయులు, నరేష్, సునీత మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు నిర్వహించిన

## కొత్తగూడెం ఏరియా సింగరేణి జిఎం ఎం.షాలెం రాజు.

భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడకను నిర్వహించిన కొత్తగూడెం ఏరియా సింగరేణి యామాన్యం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయము నందు స్వర్గీయులు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడకను నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా జిఎం ఎం.షాలెం రాజు మాట్లాడుతూ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ గారు తెలంగాణ సిద్ధాంత కర్తగా తొలిదశ ఉద్యమ జ్యోతిగా పేరు పొందారు. వీరూ ఉన్నత విలువలకు, నీతి నిజాయితీలకు ప్రతిరూపంగా జయశంకర్ గారు నిలుస్తారని, ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయమని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయడం కొరకు వారు అహర్నిశలు కృషి చేశారని అలాగే రాష్ట్రం ఏర్పాటు కొరకు ఆమరణ నిరాహార దీక్ష యందు అలాగే రాష్ట్ర ఏర్పాటు కొరకు నిర్వహించిన అనేక సమ్మెలలో కూడా పాల్గొన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిఎం షాలెం రాజు తో పాటు ఎస్ ఓ టు జిఎం జి.వి. కోటి రెడ్డి, ఏఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కొత్తగూడెం ఏరియా జక్కుల గట్టయ్య, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ కొత్తగూడెం ఏరియా ఎండి. రజాక్, ఎజిఎం (సివిల్) సిహెచ్.రామకృష్ణ,



ఎజిఎం(ఫైనాన్స్) కే హనా సుమలత, డీజీఎం (ఐఈడి) ఎన్.యోహాన్, ఎన్విరాన్మెంట్ ఎస్.ఓ.ఎం టి.సత్యనారాయణ, పర్చేస్ డిపార్ట్మెంట్ ఇన్చార్జి బి మాధవ్, డివై. పిఎం ఎం. శ్రావణ్ కుమార్, సీనియర్ పిఓ ఎం. మురళి, సింగరేణి సేవ సమితి కోఆర్డినేటర్ సిహెచ్.సాగర్ మరియు జిఎం కార్యాలయంలోని ఇతర ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

## గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

### రెండు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్న పోలీసులు



మెట్ పల్లి(గౌతమ్ న్యూస్): పట్టణంలోని వెంకట్రావుపేట వద్ద పోలీసుల వాహనాల తనిఖీలలో. పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు మాగిని దేవా నర్సయ్య మరియు కోరే రాజు బుల్లెట్ వాహనంపై 100 గ్రాముల గంజాయి తో పట్టు పడ్డారు గంజాయి విలువ సుమారు 5000 , వారి నుండి బుల్లెట్ వాహనం రెండు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్టు మెట్ పల్లి డిఎస్పి ఉమా మహేశ్వరారావు తెలిపినారు. మెట్ పల్లి, కోరుట్ల పట్టణ, పరిసర ప్రాంతాలలో ఎవరైనా గంజాయిని సరాపర చేసిన, అమ్మిన, సేవించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పి హెచ్చరించారు. డిఎస్పిఉమామహేశ్వరా రావు .మెట్ పల్లి ఎస్ ఐ చిరంజీవి వారి టీం ని అభినందించారు.



# చలో భద్రాద్రి కొత్తగూడెం

### జయప్రదం చేయండి సేవాలాల్ సేన

### ప్రపంచ ఆదివాసి గిరిజన దినోత్సవం ఆగస్టు 9 జయప్రదం చేయండి



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): ప్రపంచ ఆదివాసి గిరిజన దినోత్సవ కరపత్రాలను కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మరియు ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా చేతుల మీదుగా విడుదల చేయడం జరిగింది, ప్రతి ఒక్క గిరిజన బిడ్డ ఈనెల 9 నా గిరిజన దినోత్సవం జరుపుకోవాలని తెలియజేస్తూ ఈ కరపత్రికను విడుదల చేయడమైనది, ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బర్మావత్ హరినాయక్, జిల్లా కోకన్వీనర్లు శివ నాయక్, చందర్ నాయక్, ధరావతు కృష్ణ నాయక్, జరుపుల లచ్చు నాయక్, విష్ణు నాయక్, రాందాస్ నాయక్, బాబు నాయక్, బట్టు హుస్సేన్ నాయక్, భరత్ నాయక్, విజయ నాయక్, తదితరులు మండల నాయకులు పాల్గొన్నారు.

## కేరళ వాయనాడ్ వరద బాధితులకు రూ.60వేల నగదు చెక్కును

### జాతీయ కార్యదర్శి నారాయణ కు అందజేసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : వరదలు ముంచెత్తడంతో సర్వస్వం కోల్పోయిన కేరళ రాష్ట్రంలోని వాయనాడ్ వరద బాధితులకు జిల్లాలోని పలు మండలాల్లో సేకరించిన వరద సహాయక నిధిని మంగళవారం సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణకు సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అందించారు. మొదటి దఫా సేకరించిన రూ.60వేల చెక్కును అందించినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో పార్టీ, ప్రజాసంఘాల శ్రేణులు నిధి వసూలు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించాలని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, నరాటి ప్రసాదరావు, చంద్రగిరి శ్రీనివాసరావు, మండలాల కార్యదర్శులు వాసిరెడ్డి మురళి, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, భూక్యా దస్రు, బొర్రా కేశవరావు, నయీమ్ ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి లో వ్యక్తి దారుణ హత్య!

### హత్య కేసులో నిందితుడు ప్రత్యర్థుల చేతుల్లో హత్య!!

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): వనపర్తి జిల్లా కేంద్ర సమీపంలో హత్య కేసులో నిందితుడిగా ఉన్న ముద్దాయిని కోర్టులో కేసు ఉన్న సందర్భంగా కోర్టుకు హాజరై తిరిగి వెళుతున్న సమయంలో పకడ్బందీగా గతంలో హత్య కేసులో నిందితుడుగా ఉన్నందున అదే నెపంతో ప్రత్యర్థులు పకడ్బందీ ప్రణాళికతో హత్య కేసులో నిందితుగా ఉన్న వ్యక్తిని దారుణంగా హత్య చేసిన సంఘటన వనపర్తి జిల్లా కేంద్రంలోని మరికుంట శివారులో జరిగినట్లు పోలీస్ వర్గాల ద్వారా తెలిసింది, సమయం దాటిపోవడంతో చీకటి మయంగా ఉన్న సందర్భంలో నిందితుని గుర్తించడానికి పోలీసులు హుటాహుటిన హత్య జరిగిన ప్రాంతానికి బయలుదేరి హత్య జరిగిన తీరు పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది, ఈ హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియవలసి ఉంది,

## యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యం లో 329వ రోజు అన్నదాన కార్యక్రమం



వరంగల్ ,(గౌతమ్ న్యూస్): యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాకు చెందిన " మార్త అనిల్ కుమార్ " పుట్టినరోజు సందర్భంగా " మార్త అనిల్ కుమార్ - జ్యోతి దంపతుల " సహకారంతో స్వయంకృషి మహిళా సొసైటీ వృద్ధాశ్రమం ములుగు రోడ్డు , హనుమకొండ లో ఉన్న వృద్ధులకు 329వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్త అనిల్ కుమార్ - జ్యోతి , మార్త సహస్ర , మార్త సాత్విక , చందు వారి కుటుంబ సభ్యులు యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్ , వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు ) , కానిస్టేబుల్ బొట్టు కమలాకర్ , కోలా రాజేష్ , ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ , అలువల పృథ్వి , ఉప్పరపల్లి రాజ్ కుమార్ , మునిగాల రాంప్రసాద్ , సృజన , జ్యోతి , భావన , బిటుకూరి యాకయ్య , పాలకుర్తి విష్ణు , ఎస్.కె ముస్తఫా , లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ ( హైకోర్ట్ అడ్వకేట్ ) , ఊరటి రవికుమార్ , యాద రవి కుమార్ , చెలిమల్ల అశోక్ కుమార్ , తూనం రాము , సి.ఐ.ఎస్.ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్ , మోడెం రాజశేఖర్ గౌడ్ తదితరు పాల్గొన్నారు.

## పందెం కోళ్లను వేలం వేసిన పోలీసులు..



పెద్దపల్లి(గౌతమ్ న్యూస్): పందెం రాయుళ్లు కోడిపుంజులను పందేలకు సిద్ధం చేసి కోడి పందేలు నిర్వహిస్తున్నప్పుడు పోలీసులు దాడులు చేసి నిర్వాహకులను అరెస్టు చేశారు.. ఈ సందర్భంగా అక్కడ పందెంలో ఉంచిన రెండు కోళ్లను స్వాధీనం చేసుకు న్నారు పోలీసులు. ఈ కేసులో నిందితులను కోర్టులో హాజరు పరిచారు పోలీసులు. అయితే కేసును విచారించి నిందితులకు జరిమానా వేసిన జడ్జి పందెం కోళ్లను వేలం వేయాలని తీర్పు ఇచ్చారు. దీంతో పోలీసులు ఈరోజు వేలం వేశారు. ఇదినిజమండి బాబు.. పెద్దపల్లి జిల్లా కమాన్పూర్ లో మంథని కోర్టు ఆదేశాల తో కోళ్లను ఠాణాకు తీసుకొచ్చిన పోలీసులు వాటి కోసం ప్రత్యేక బోను ఏర్పాటు చేశారు. నిత్యం దాణా, నీటిని అందించారు. కోర్టు ఆదేశాలతో పందెం కోళ్లను కమాన్పూర్ పోలీస్ స్టేషన్లో మంగళవారం వేలం పాట నిర్వహించారు పోలీసులు.. ఈ వేలంపాటలో అత్యధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. మొదటి పందెం కోడి 2 కిలోల 980 గ్రాముల బరువు ఉండగా... దాన్ని 4 వేల రూపాయలకు వేలంలో దక్కించుకున్నారు కమాన్పూర్కు చెందిన పురాణం సారయ్య. రెండో కోడి 2 కిలోల 410 గ్రాములు ఉండగా దాన్ని 2 వేల 500 రూపాయలకు కమాన్పూర్కు చెందిన బోనాల సత్తయ్య వేలంలో దక్కించుకున్నాడు. పందెం కోడి టేస్టీగా ఉంటుం దని అందుకే వేలంలో కమాన్పూర్ గ్రామస్తులు దక్కించుకు న్నారనుకుంటే పొరపాటే.. వేలంలో దక్కించుకున్న కోళ్లను బ్రీడ్ కోసం.. తమ ఫామ్లో పెంచుతామంటున్నారు వేలంలో దక్కించుకున్న ఆ ఇద్దరు కమాన్పూర్ గ్రామస్తులు.

## పాఖాల వద్ద పోలీసు హెచ్చరిక బోర్డులు




ఖానాపురం(గౌతమ్ న్యూస్): పాఖాల ప్రకృతి అందాలను వీక్షించడానికి వస్తున్న పర్యాటకులు ఏలాంటి ప్రమాదాలకు గురికాకుండా ఖానాపురం ఎస్ ఐ రఘుపతి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. పాఖాల సరస్సు సమృద్ధిగా నిండి మత్తడికి చేరువలో ఉంది. రానున్న రోజుల్లో పర్యాటకుల రద్దీ పెరగనుంది. సరస్సుల్లోకి దిగి ప్రాణాలు పోగోట్టుకోవద్దని ముందస్తుగా హెచ్చరిక బోర్డులను పాఖాల సరస్సు వద్ద పలు చోట్ల అమర్చారు.సరస్సు మత్తడివద్ద నీటిలోకి దిగరాదు. ఫాఖాల సరస్సులోకి దిగడం ప్రమాదకరం ,మొసళ్ళు ఉన్నాయి జాగ్రత్త.సరస్సు నీటి వద్ద సెల్ఫీలు తీయటం చేయరాదు. మీ విలువైన వస్తువుల పట్ల జాగ్రత్తలు పాటించండి. పాఖాల ప్రకృతిని, అందాలను కాపాడుదాం శుభ్రత పాటిద్దాం. అని హెచ్చరిక బోర్డులపై సూచించారు.

## ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



ములుగు(గౌతమ్ న్యూస్): మహాత్మా జ్యోతిరావు పూలే కొత్తగూడ పాకాల- ములుగు గురుకుల ఆరేపల్లి లోని పాఠశాలలో ఆచార్య జయశకర్ సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణా సాధనకు సృష్టికర్త సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశకర్ అన్నారు. ఆయన కలలు కన్న తెలంగాణా రాష్ట్రాన్ని సాధించుకున్నామని సార్ కలలు కన్నట్లు పేద విద్యార్థులు బాగా చదువుకొని గొప్ప స్థానాల్లో స్థిరపడాలని విద్యార్ధులకు సూచించారు. మన స్వరాష్ట్ర సాధన ద్వారానే నేడు వందలాది గురుకుల పాఠశాలలు ఏర్పడ్డాయని అన్నారు. అన్నీ వర్గాల ప్రజలు జయ శంకర్ సార్ ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంక్షేమ వేదిక సామజిక సేవా సంస్థ అధ్యక్షులు మడికొండ రఘుపతి ప్రసంగించారు. ఉపాధ్యాయ బృందం పూలమాలలు వేసి జయశంకర్ సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్ధులు పాల్గొన్నారు.

## సఖి సెంటర్లు ఆదర్శవంతంగా సేవలందించాలి




హైదరాబాద్ (గౌతమ్ న్యూస్): సఖి సెంటర్లు ఆదర్శవంతంగా సేవలందించాలని సఖి జాతీయ మహిళా మండలిఫౌండర్ ,చైర్మన్ నరాల సత్యనారాయణ అన్నారు. సఖి జాతీయ మహిళా మండలి ఆధ్వర్యంలో తెలంగాణ హైదరాబాద్ మధుర నగర్ లో ఫ్లాట్ నెంబర్ ఎఫ్ 1 లో సఖి కార్యాలయంను ఫౌండర్ చైర్మన్ నరాల సత్యనారాయణ ప్రారంభించారు. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో పురుషాదిపత్యంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించడానికి బాధితులకు అండగా ఉండలన్నారు.లైంగిక వేదింపులు,గృహహింస వంటి ఘటనలలో మహిళలకు ,బాలికలకు అండంగా ఉండి న్యాయపోరాటం చేయాలన్నారు.అనంతరం సఖి జాతీయ మహిళా మండలి వైస్ ప్రెసిడెంట్ నన్నక సీత మాట్లాడుతూ నా సేవలు గుర్తించి నాకు ఈ పదవి ఇచ్చినా ఫౌండర్ చైర్మన్ నరాల సత్యనారాయణకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అందరిని కలుపుకొని ముందుకు సాగుతామని, నిరుపేదలకు న్యాయం జరిగేలా మా సేవలు అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కంచర్ల మంజుల, శ్యామల సంధ్య ,గౌరీ, మాధవి ,ప్రత్యూష ,రేఖ ,లక్ష్మి ,పద్మ లావణ్య ,శ్రీలత ,శిరీష ,నీరజ తదితరులు పాల్గొన్నారు.

## పండగ సీజన్‌లో శనగపప్పు ధరలకు రెక్కలు



పండగ సీజన్‌కు ముందే పప్పుల ధరలు పెరుగుతున్నాయి. దేశంలో అత్యధికంగా వినియోగించే శనగపప్పుకు డిమాండ్ పెరుగుతోంది. అందుకు తగిన సరఫరా లేకపోవడంతో గత నెల నుంచి వీటి ధరలు 10 శాతం పెరిగాయి. దాంతో సమీప భవిష్యత్తులో ఇంకెంత పెరుగుతుందోనని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. స్వీట్‌లు, లడ్డూలు, ఇతర వంటకాల తయారీలో శనగపప్పు అవసరం అవుతుంది. అయితే అంతకుముందు నెల వీటి ధరలు దాదాపు 5% పడిపోయాయి. దాంతో వినియోగదారులకు కొంత ఉపశమనం లభించినట్లయింది. కానీ తాజా నివేదికల ప్రకారం ఇటీవల కాలంలో వీటి ధర 10 శాత పెరగడం మళ్లీ ఆందోళన కలిగిస్తుంది. ఇండియన్ పల్సెస్ అండ్ గ్రెయిన్స్ అసోసియేషన్(ఐపీజీఏ) ప్రకారం..శనగపప్పుకు స్థిరమైన డిమాండ్ ఉంది. దేశీయంగా సరఫరా తగ్గింది. ప్రభుత్వం వద్ద పరిమిత స్టాక్ ఉంది. కానీ, రానున్న రోజుల్లో దిగుమతులు పెరుగుతాయి. దాంతో డిమాండ్‌ను అదుపుచేయవచ్చు. దానివల్ల ధరలు పెరగకుండా నియంత్రించవచ్చు. ప్రభుత్వం శనగపప్పు ధరలు పెరుగుతాయని ముందే ఊహించి పసుపు బఠానీలను భారీగా దిగుమతి చేసుకుంది. కానీ ఆశించిన విధంగా శనగపప్పు డిమాండ్‌ను భర్తీ చేయలేదని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఇదిలాఉండగా, సెప్టెంబరు నాటికి ఆఫ్రికా, ఆస్ట్రేలియాల నుంచి శనగపప్పు దిగుమతులు పెరగడం వల్ల ధరలు మరింత పెరగకుండా నిరోధించవచ్చని కొందరు వ్యాపారులు తెలిపారు. పసుపు బఠానీలను ఎలాంటి సుంకం లేకుండా దిగుమతి చేసుకునేలా అనుమతులు పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాంతో ధరలు అదుపులో ఉంటాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. వాతావరణ సమస్యలు, ఆఫ్రికా సరఫరాలో జాప్యం, పండగ సీజన్, రాష్ట్ర ప్రభుత్వ కొనుగోళ్లకు అనుమతులు ఇవ్వడం వంటి కారణాలతో రానున్న రోజుల్లో కంది పప్పు ధరలు కూడా పెరుగుతాయిని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## బంగ్లాదేశ్ హింస, షేక్ హసీనా రాకపై జైశంకర్ కీలక ప్రకటన..

బంగ్లాదేశ్ హింసపై ఇండియా ఆందోళన చెందుతోంది. తీవ్ర హింసాత్మక పరిస్థితుల నేపథ్యంలో నిన్న బంగ్లా ప్రధాని పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనా, భారత్‌కి చేరింది. ఇక్కడ నుంచి బ్రిటన్‌లో ఆశ్రయం పొందేందుకు వెళ్తున్నట్లు సమచారం. ఇదిలా ఉంటే బంగ్లాదేశ్ వ్యాప్తంగా హిందువులను టార్గెట్ చేస్తున్నారు హింసాత్మకవాదులు. దీంతో భారత్ అక్కడి మైనారిటీల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తోంది. తాజాగా భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ రాజ్యసభలో మాట్లాడుతూ.. "మా దౌత్య కార్యకలాపాల ద్వారా మేము బంగ్లాదేశ్‌లోని భారతీయ సమాజంతో టచ్‌లో ఉన్నామని చెప్పారు. అక్కడ 19,000 మంది భారతీయులు ఉన్నారని అంచనా. 9000 మంది విద్యార్థులు జూలైలో తిరిగి వచ్చారు%౫% మేము వారి రక్షణ మరియు శ్రేయస్సును నిర్ధారించడానికి వివిధ సమూహాలు మరియు సంస్థల ద్వారా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాము. శాంతిభద్రతలను పునరుద్ధరించే వరకు తీవ్ర ఆందోళన చెందుతున్నాము. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని కోరాము. గత 24 గంటలుగా ఢాకాలోని అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం. ఆ దేశంలో మైనారిటీల పరిస్థితిపై ఆందోళన చెందుతున్నాము" అని అన్నారు. బంగ్లాదేశ్ లో ఉన్న భారత్ దేశ వ్యవస్థలను అక్కడి ప్రభుత్వం కాపాడుతుందని అశిస్తున్నామని అన్నారు. బంగ్లాదేశ్ లోని మైనారిటీలు, వారి వ్యాపారాలపై జరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయని చెప్పారు. ఆ దేశంలోని హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నాయని, బంగ్లాదేశ్ సైన్యంతో ఎప్పటికప్పుడు భారత్ మాట్లాడుతూనే ఉందని జైశంకర్ సభలో చెప్పారు. ఆ దేశంలో భారత్‌కి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, షేక్ హసీనా భారత్ వస్తానని అభ్యర్థించినట్లు వెల్లడించారు. అతి తక్కువ సమయంలో ఆమె భారత్ వస్తున్నట్లు సమచారం అందినట్లు తెలిపారు.

# సంక్షుభిత బంగాళం




భయపడినంతా అయింది. బంగ్లాదేశ్ రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయింది. హింసాత్మకంగా మారిన విద్యార్థుల నిరసనలు, వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహం మధ్య అవామీ లీగ్ పార్టీ సారథి షేక్ హసీనా ప్రధానిగా రాజీనామా చేసి, సైనిక విమానంలో దేశం విడిచిపోవాల్సి వచ్చింది. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా సాగిన 1971 నాటి బంగ్లాదేశ్ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నవారి కుటుంబ సభ్యు లకు ప్రభుత్వోద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్లు కల్పించిన వివాదాస్పద కోటా విధానంపై మొదలైన రచ్చ చివరకు ఇంతకు దారి తీసింది. జూలైలో ఢాకా యూనివర్సిటీలో ఆరంభమైన విద్యార్థుల నిరసన ప్రదర్శనలు ఇంతలు అంతలై, ఘర్షణలకు దారి తీశాయి. గత నెలలోనూ, అలాగే ఈ ఆదివారమూ కలిపి 300 మందికి పైగా అమాయకుల ప్రాణాలు పోవడంతో బంగ్లాలో పరిస్థితులు వేగంగా మారాయి. గత నెలలో సుప్రీమ్ కోర్ట్ జోక్యం చేసుకొని, అన్నీ కలిపి 56 శాతమున్న రిజర్వేషన్లను 7 శాతానికి తగ్గించినప్పుడు నిరసనలు తగ్గి, ప్రశాంతత నెలకొంటుందని భావించారు. అప్పటికి కాస్త ఆగినట్టనిపించినా, మృతుల కుటుంబాలకు న్యాయం పేరిట మళ్ళీ నిరసనలు రేగాయి. ప్రభుత్వ అనుకూల, ప్రతికూల వర్గాల మధ్య మళ్ళీ రేగిన ఘర్షణల్లో ఒక్క ఆదివారమే 100 మంది దాకా చనిపోవడం, విద్యార్థుల 'చలో ఢాకా' ప్రదర్శన నేపథ్యంలో అగ్నిపర్వతం బద్దలైంది. క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను గుర్తించకుండా, నిరంకుశంగా వ్యవహరిస్తే ఎంతటి పాపు లర్ నేతకైనా ఎలాంటి దురవస్థ తలెత్తుతుందో సోమవారం నాటి దృశ్యాలు కళ్ళకు కట్టాయి. దేశ వ్యాప్త కర్ఫ్యూ, ఇంటర్నెట్ సేవల సస్పెన్షన్ విధించినా ఢాకాలో రోడ్ల నిండా జనం, ప్రధాని నివా సాన్ని వారు చుట్టుముట్టిన తీరు, హసీనా రాజీనామా, విలాసవంతమైన ఆమె నివాసంలోకి జనం చొచ్చుకుపోయి లూటీ సాగించిన తీరు చూస్తుంటే... సరిగ్గా రెండేళ్ళ క్రితం 2022 జూలైలో శ్రీలంకలో అధ్యక్షుడు రాజపక్సేకు ఎదురైన ఘటనలు గుర్తుకొస్తాయి. దేశాలు, ప్రజలు వేరైనా, రెండు ఘటనల్లోనూ నిరంకుశ పాలన, అవినీతి, ఆశ్రిత పక్షపాతాలే ఇంతటి జనాగ్రహానికి కారణమయ్యా యని మరిచిపోరాదు. అయితే, బంగ్లాలో రెచ్చిపోయిన జనం ప్రధాని నివాసంలోకే కాక, ఆఖరికి దేశ పార్లమెంట్‌లోకి చొరబడి యథేచ్ఛగా ప్రవర్తించడం విస్మయం కలిగిస్తుంది. షేక్ హసీనా తండ్రి, బంగ్లాదేశ్ జాతిపిత అయిన ముజిబుర్ రెహమాన్ విగ్రహాన్ని సైతం ధ్వంసం చేయడం, బంగబంధు మ్యూజియమ్‌ను తగలబెట్టడం, అధికార అవామీ లీగ్ ఆఫీసులకూ – పోలీస్ స్టేషన్లకూ – ప్రభుత్వ ఆఫీసులకూ నిప్పు పెట్టడం ప్రజాస్వామ్య వాదులకు ఆవేదన, ఆందోళన కలిగించక మానవు. అయిదు దశాబ్దాల స్వతంత్ర బంగాళం ఇటీవలెన్నడూ చూడని హింస, రాజకీయ సంక్షోభం ఇది. ఒక రకంగా ఇది అయిదుసార్లు బంగ్లా ప్రధానిగా వ్యవహరించిన 76 ఏళ్ళ హసీనా స్వయంకృతం. 2009 జనవరి నుంచి పదహారేళ్ళుగా నిర్విరామంగా అధికారంలో ఉన్న ఈ ఉక్కుమహిళ అనేక సంక్షోభాలనూ, హత్యాయత్నాలనూ దాటి వచ్చి, దేశాన్ని ఆర్థికంగా పైకి తెచ్చిన మాట నిజమే. ఒక దశలో ఇస్లామిక్ ప్రపంచంలో ప్రజాస్వామ్య, లౌకికవాదాలకు నమూనాగా తెచ్చుకున్న పేరూ పెద్దదే. కానీ, ప్రతిపక్ష నేతల్ని జైలులో పెట్టి, విమర్శకులను దేశద్రోహులుగా చిత్రించి, చట్టంతో పని లేకుండా ప్రత్యర్థుల్ని అడ్డు తొలగించుకుంటూ వచ్చి అభిమానుల్లో సైతం అప్రతిష్ఠ తెచ్చుకున్నారు. కోవిడ్ అనంతర పరిస్థితులు, రష్యా – ఉక్రెయిన్ యుద్ధంతో ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలమైంది. పెరిగిన ధరలు, పెచ్చుమీరిన నిరుద్యోగం, అణచివేతలతో అన్ని వర్గాల్లో అసంతృప్తి పేరుకుంది. పైగా, గడచిన రెండు తడవలుగా బంగ్లా ఎన్నికలు పరిహాసప్రాయమయ్యాయి. ముఖ్యంగా ఈ ఏటి జన వరి ఎన్నికలు వట్టి రిగ్గింగ్ అనే ఆరోపణలూ వచ్చాయి. ఇప్పుడామె రాజీనామాతో రోడ్డు మీద కొచ్చి ఆడామగా ఆనందిస్తున్న తీరు చూస్తే మార్పుకై జనం ఎంతగా మొహం వాచారో అర్థమవుతుంది. హసీనా రాజీనామాతో ప్రస్తుతం బంగ్లాదేశ్ సైన్యం కనుసన్నల్లోకి వెళ్ళింది. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్మీ ఛీఫ్ సమావేశమైనట్టు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుత ఆందోళనలకు అడ్డుకట్ట వేసి పరిస్థితిని చక్కదిద్దుతామనీ, త్వరలోనే తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటవుతుందనీ ఆర్మీ ఛీఫ్ ప్రకటించారు. అయితే, అది అంత సులభమేనా? దేశమంతా అల్లకల్లోలంగా ఉంది. పాలనా యంత్రాంగం పూర్తిగా పడకేసింది. సాక్షాత్తూ సైన్యం ఎదుటే ప్రదర్శకులు రెచ్చిపోతున్న దృశ్యాలూ కనిపించాయి. గత వారం నిషేధానికి గురైన జమాతే ఇస్లామీ వర్గీయులు సహా ఇంతకాలం అణచివేతకు గురైన ప్రతిపక్షాల మద్దతుదారులూ రోడ్డెక్కడంతో నిరసనకారుల్లో అందరూ విద్యార్థులే అనుకోలేం. అనూహ్య విధ్వంసం చూస్తుంటే, అసాంఘిక శక్తులు చేరాయన్న అనుమానాలూ వినిపిస్తున్నాయి. బంగ్లాదేశ్ పరిణామాలు భారత్‌పై చూపే ప్రభావమూ ఎక్కువే. కొన్నేళ్ళుగా భారత అనుకూల హసీనా ఏలుబడి మనకు కలిసొచ్చింది. ఇప్పుడిక ప్రతికూల పార్టీలు అక్కడ అధికారంలోకి వస్తే చిక్కులు తప్పవు. మళ్ళీ ఒకప్పటిలా సరిహద్దులో తీవ్రవాద సంస్థల పీడ పెరుగుతుంది. అవి అక్కడ తిష్ఠ వేసి, మన ఈశాన్య రాష్ట్రాల్లో సమస్యలు సృష్టిస్తాయి. చొరబాట్లూ ఎక్కువవుతాయి. కోటీ 30 లక్షల మంది హిందువులున్న బంగ్లాలో భారత మైనారిటీల భద్రత ప్రశ్నార్థకమవుతుంది. హసీనా ఉండగానే వారి పైన దాడులు తప్పలేదు. ఇక, ఛాందసవాద, ప్రతికూల శక్తులు గద్దెనెక్కితే పరిస్థితి ఎలా ఉంటుందో? అలాగే, ఢాకా దృశ్యాలను చూస్తే, ఇదే అదనుగా తీవ్రవాద శక్తులు విజృంభించ కుండా బంగ్లా సమాజం అప్రమత్తం కావాలనిపిస్తోంది. ముందుగా శాంతిభద్రతలు నెలకొనడం అవసరం. ఎలాంటి సర్కారుతో సాగాలి, మళ్ళీ ఎన్నికలు లాంటివన్నీ ఆ తర్వాతే! అది పూర్తిగా ఆ దేశ అంతర్గత వ్యవహారం, ప్రజాభీష్టం. ఏమైనా రానున్నరోజులు బంగ్లాకే కాదు భారత్‌కూ కీలకం.

# 'శవాలదిబ్బ'... ఆ మారణహోమానికి 79 ఏళ్లు




హిరోషిమా, నాగసాకిలపై అణ్వస్త్ర దాడులు జరిగి నేటికి (ఆగష్టు 6, 2024) 79 ఏళ్లు. ప్రపంచాన్ని దిగ్భ్రాంతిలో ముంచేసిన తీరని విషాదం. జపాన్‌లో 1945 ఆగస్ట్‌లో జరిగిన అణు బాంబు పేలుళ్లతో హిరోషిమాలో లక్షా 40వేల మంది, నాగసాకిలో 74వేల మందిని బలి తీసుకున్న ఉదంతం. ప్రపంచంలోనే తొలి అణు బాంబు దాడిగా పేరొందిన ఈ దాడుల ధాటికి విలవిల్లాడిన జపాన్ శత్రు దేశాలకు లొంగిపోవడంతో 1945 ఆగస్ట్ 14న రెండో ప్రపంచ యుద్ధం ముగిసింది. హిరోషిమా డే సందర్భంగాఈ ఘటనకు సంబంధించిన కొన్ని ప్రత్యేక సంగతులు..! 1945 ఆగష్టు 6న జపాన్‌లోని హిరోషిమా నగరంపై అమెరికా అణు బాంబు జారవిడిచింది. ఎనోలా గే అనే అమెరికన్ %బీ%-29 బాంబర్, జపాన్ నగరం హిరోషిమాపై "లిటిల్ బాయ్" అనే అణు బాంబును జారవిడిచింది. ఈ బాంబు పేలిన కాసేపట్లోనే 5 చ.కి.మీ. పరిధిలోని ప్రాంతం నాశనమైంది. 80 వేల మంది ప్రాణాలు కోల్పోగా, 35 వేల మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయాలు, రేడియన్ ప్రభావంతో వేలాదిమంది చనిపోయారు. మరో మూడు రోజులకు అంటే ఆగస్టు 9న నాగసాకి నగరంపై అమెరికా మరో భారీ అణుబాంబుతో దాడి చేసింది. హిరోషిమా అంటే జపనీస్ బాషలో విశాలమైన దీవి. దీవుల సమాహారమైన జపాన్‌లోని అతిపెద్ద దీవిలో ఉన్న పెద్ద నగరం హిరోషిమాపై యురేనియం–235తో తయారు చేసిన "లిటిల్ బాయ్", నాగసాకిపై ప్లూటోనియంతో తయారుచేసిప "ఫ్యాట్ మ్యాన్" అనే అత్యంత పవర్‌పుల్ బాంబును ప్రయోగించింది. 'ఎనోలా గే' అనే విమానం బరువు 9 వేల పౌండ్లు, పొడవు 10 అడుగులు. ఈ బాంబు నేలను తాకడానికి ముందే, 1750 అడుగుల ఎత్తులోనే పేలింది. ఈ దాడికి ముందు హిరోషిమా జనాభా దాదాపు 3.4 లక్షలు కాగా, తర్వాత అది 1.37 లక్షలకు పడిపోయిందంటే ఈ విధ్వంసాన్ని అర్థం చేసుకోవచ్చు. ప్రధానంగా జపాన్‌లో ఐదు నగరాలను ఎంచుకుంది. కోకురా, హిరోషిమా, యోకోహామా, నీగాటా ,క్యోటో. ఈ దాడులకు యునైటెడ్ కింగ్‌డమ్ సమ్మతించింది.ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, పురాతన రాజధాని పట్ల అప్పటి సెక్రటరీ ఆఫ్ వార్ హెన్రీ స్టిమ్సన్‌కు ఉన్న అభిమానం కారణంగా క్యోటో తప్పించుకుంది. దానికి బదులుగా, నాగసాకి నగరం బలైంది. ఈ బాంబు పేలుళ్లలో బతికి బయటపడిన వారిని హిబాకుషా అంటారు. పేలుళ్ల ప్రభావంతో ఏర్పడిన రేడియేషన్, విషవాయువులు ప్రభావంతో బాధితుల మానసిక వేదన, బాధలు వర్ణనాతీతం. అణ్వాయుధాల వినాశకరమైన ప్రభావాన్ని కళ్లకు కట్టిన మారణహోమం.

### ఇపుడు అణుయుద్ధం జరిగితే

రష్యా ఉక్రెయిన్ యుద్ధం, ఉత్తర, దక్షిణ అమెరికా ఘర్షణలు మధ్య ఇపుడు అణు యుద్ధం జరిగితే ఎంతమంది చనిపోవచ్చు? అనేది ప్రధానంగా వినిపించే ప్రశ్న. అణు సంఘర్షణ ప్రభావాలను అధ్యయనం చేస్తూ సంవత్సరాలు గడిపిన జర్నలిస్ట్ అన్నీ జాకబ్‌సెన్ అంచనాల ప్రకారం అణు యుద్ధం ప్రారంభమైన 72 నిమిషాల్లోనే దాదాపు ఐదు బిలియన్ల మంది ప్రజలు చనిపోతారు. రేడియేషన్ ప్రభావం అత్యంత దారుణంగా ఉంటుంది. ఎందుకంటే ఇప్పటికే ఓజోన్ పొర చాలా దెబ్బతింది కనుక అణువిస్ఫోటనాలు జరిగితే ఊహకందని విధ్వంసమే. అణుయుద్ధం నుండి బతికిన వారికి ఆహారం లభించదు. ఆకలితో అలమటించి. పోషకాహార లోపంతో కృంగి కృశించి ప్రాణాలొదులుతారు.

# నా కుమారుని మృతి పై విచారణ చేపట్టి కారకులైన వారిపై చట్టారీత్యా చర్యలు తీసుకోవాలి

## మనవి చేసుకున్న మృతుని తండ్రి కొల్లూరి నాగరాజు



హైదరాబాద్(గౌతమ్ న్యూస్): నా కుమారుడు అయినా కొల్లూరి రేవంత్ కుమార్, వయసు 28 సంవత్సరాలు మృతి పై విచారణ చేపట్టి, మృతికి కారకులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బాలానగర్ పోలీస్ ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్ ను మృతుని తండ్రి కొల్లూరి నాగరాజు కోరారు. మంగళవారం సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ పోలీస్ ఇన్స్పెక్టర్కు దరఖాస్తు చేసుకొని గతంలో జరిగిన సంఘటనలను విన్నవించుకోనైనది. ఈ సందర్భంగా మృతుని తండ్రి కొల్లూరి నాగరాజు మీడియాతో మాట్లాడుతూ నా కుమారుడు కొల్లూరి రేవంత్ కుమార్ అను అతను సుమారు 7 సంవత్సరాల నుండి బీరప్ప నగర్, కుత్బుల్లాపూర్, హైదరాబాదులో సువెంక్ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్నాడు. అదే గ్యాస్ ఏజెన్సీలో గల ఆఫీసు రూములో ఉంటున్నాడు. ఇదే క్రమంలో నాకు తేదీ 08/6/2024 రోజున ఉదయం గం" 3:40 నిమిషాల సమయంలో ఇదే గ్యాస్ ఏజెన్సీలో పనిచేసే ఎరబోయిన రాజు ఫోన్ చేసి నా కుమారునికి బాలానగర్ హెచ్.ఏ.ఎల్, గేట్ నెంబర్–2 దగ్గర యాక్సిడెంట్ జరిగింది అని, వెంటనే బయలుదేరి రమ్మని చెప్పాడు. వెంటనే నేను, నా కుటుంబ సభ్యులము, నా దగ్గరి బంధువు ఆకారపు రాములుతో కలిసి హైదరాబాదుకు తేదీ 08/6/2024 రోజున ఉదయము అందాజా 9:00 గంటలకు చేరుకోగా! నా కుమారుడు షాపూర్ నగర్ లోని రామ్ రాజ్ హాస్పిటల్ లో కోమాలో ఉండిపోయి, వెంటిలేటర్ మీద చికిత్స పొందుతున్నాడని తెలిపాడు. అక్కడి నుండి నా కుమారున్ని మెరుగైన వైద్యం కోసము తేదీ 14/6/2024 రోజున పంజాగుట్ట లోని నిమ్స్ హాస్పటల్ కు తీసుకొని పోయి చికిత్స చేయించుచుండగా! నా కుమారుడు కొల్లూరి రేవంత్ కుమార్ తేదీ 24/6/2024 రోజున ఉదయము గంటల 6:42 నిమిషాలకు మృతిచెందినాడు. నా కుమారుడు మృతి చెందిన విషయంలో 1,పుల్లూరి రమేష్ 2,ఎర్రబెల్లి రామ్మోహన్ రావు, 3,ఎర్రబెల్లి ప్రభాకర్ రావు అను వారి మీద అనుమానం కలదు. వీరు నా కుమారుడ్ని మాటిమాటికి మానసికంగా ఇబ్బందులు పెట్టేవారని నా కుమారుడు మా ఇంటికి వచ్చినప్పుడు చెప్పాడని, అందువల్లనే నాకు వారి మీద అనుమానం ఉందని, అలాగే చరణ్ (1,పుల్లూరి రమేష్ స్నేహితుడు) అనే అతనిపై కూడా అనుమానం కలదని తెలిపాడు. కావున నా కుమారుని మృతి మీద విచారణ జరిపి, అతని మృతికి కారణమైన వారి మీద చట్టరీత్యా తగు చర్యలు గైకొనగలరని మృతుని తండ్రి కొల్లూరి నాగరాజు కోరారు.

# ఆస్పత్రిలో చేరిన మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ..!



బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్.కే. అద్వానీ మరోసారి ఢిల్లీలోని అపోలో ఆస్పత్రిలో చేరారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ వినిత సూరి ఆధ్వర్యంలో అడ్మిట్ అయినట్టు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్టు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అద్వానీ గత నెల జులై లో కూడా అనారోగ్యంతో ఢిల్లీలోని అపోలో ఆస్పత్రిలో చేరారు. అంతకు ముందు ఆల్ ఇండియా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో కూడా చికిత్స తీసుకున్నారు. ప్రస్తుతం అద్వానీ వయస్సు 96 ఏళ్ళు. వయస్సు మీద పడటంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతుంటాయని.. కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం ఏమి లేదని వైద్యులు వెల్లడించారు. అద్వానీ బీజేపీ సహ వ్యవస్థాపకుల్లో ఒకరు. ఆయన 2002 నుంచి 2004 వరకు ఉప ప్రధానిగా, 1999 నుంచి 2004 వరకు కేంద్ర హోంశాఖ మంత్రిగా పని చేశారు. 2009 సార్వత్రిక ఎన్నికల సమయంలో బీజేపీ ప్రధానీ అభ్యర్థిగా ఉన్నారు. కానీ ఆ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించలేకపోయింది.

# షేక్ హసీనా పదవి కోల్పోవడం భారత్ వాణిజ్యంపై ప్రభావం చూపుతుందా..



బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోటాకు సంబంధించి మొదలైన గొడవ హింసాత్మకంగా మారి చివరికి ప్రధాని షేక్ హసీనాను పదవీచ్యుతురాలిని చేసింది. ఆమె పదవికి రాజీనామా చేసి ఆర్మీ ఎయిర్‌క్రాఫ్ట్‌లో భారత్‌కు వచ్చారు. ప్రస్తుతం ఆమె మన దేశంలో ఆశ్రయం పొందుతున్నది. భారత్-బంగ్లాదేశ్ మధ్య ఉన్న వాణిజ్య సంబంధాలపై ఏ మేరకు ప్రభావం పడుతుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి 2009లో షేక్ హసీనా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భారత్‌కు సహకరిస్తూ వచ్చారు. అదేవిధంగా ఆసియా ఖండంలో బంగ్లాదేశ్‌కు చైనా తర్వాత భారత్ రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా కొనసాగుతోంది భారత కాటన్ ఎగుమతుల్లో ఏకంగా 34.9 శాతాన్ని బంగ్లాదేశ్ దిగుమతి చేసుకుంటున్నది. అంతేగాక పెట్రోలియం ఉత్పత్తులు, తృణధాన్యాలు కూడా భారత్ నుంచి బంగ్లాదేశ్ చేసుకుంటున్న ప్రధాన దిగుమతులుగా ఉన్నాయి. ఈ క్రమంలో షేక్ హసీనా పదవీచ్యుతురాలు కావడం భారత్‌కు నష్టమనే చెప్పవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# తెలంగాణలో కొత్త విమానాశ్రయాల కోసం.. కేంద్రమంత్రిని కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే



తెలంగాణలో కొత్త విమానాశ్రయాల అభివృద్ధిపై దృష్టి సారించడంతో పాటు హైదరాబాద్ నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు దేశీయ, అంతర్జాతీయ సర్వీసులను పెంచాలని బీఆర్ఎస్ సీనియర్ నేత, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్‌మోహన్‌నాయుడును కోరారు. ప్రభాకర్ రెడ్డి మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిశారు. పౌర విమానాయ శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా రామ్‌మోహన్ నాయుడిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అంతర్జాతీయ విమానాశ్రయాలకు మెరుగైన సేవలు అందించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కొత్త విమానాశ్రయాల అభివృద్ధి వల్ల స్థానికులకు వ్యాపార, ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభిస్తాయన్నారు. ప్రభాకర్ రెడ్డి 2014 నుంచి 2024 వరకు మెదక్ ఎంపీగా పనిచేసినందున ఆ కాలంలో ఎంపీగా పనిచేసిన రామ్మోహన్ నాయుడుతో ఆయనకు సాన్నిహిత్యం ఉంది.

# రుణమాఫీ కాకపోయినా ఆందోళన వద్దు



హైదరాబాద్: గతంలో రుణమాఫీ సరిగా జరగలేదన్న భావన రైతుల్లో ఉందని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఓఆర్ఆర్‌ను రూ.7 వేల కోట్లకు అమ్మి రుణమాఫీ చేయాలని గత ప్రభుత్వం ఆలోచించిందని విమర్శించారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకులు సరైన పద్ధతిలో రుణమాఫీ చేయకపోయినప్పటికీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాత్రం విమర్శిస్తున్నారని మండిపడ్డారు. రైతుల ద్వారా రాజకీయ లబ్ధి పొందలేరని వ్యాఖ్యానించారు. "వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తోంది. ఎన్ని కష్టాలున్నా ఈ అంశంలో ముందుకెళ్తున్నాం. ప్రతిపక్ష నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారు. గత ఐదేళ్లలో రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తున్నాం. మూడు విడతల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. పాస్‌బుక్ లేకపోయినా.. తెల్లకార్డు ద్వారా రుణమాఫీ చేస్తున్నాం. రుణాలు మాఫీ కాకపోయినా రైతులు ఆందోళన చెందాల్సిన వేల ఖాతాల్లో అవసరం లేదు. సాంకేతిక కారణాల వల్ల 30 డబ్బులు జమ కాలేదు. పొరపాట్లు సరిచేసి అర్హులందర్నీ రుణ విముక్తుల్ని చేస్తాం. ఆగస్టు 15న రూ.2 లక్షల వరకు రుణమాఫీ కార్యక్రమాన్ని వైరాలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారు. రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ కొనసాగుతోంది" అని తుమ్మల వెల్లడించారు.

# బంగ్లాదేశ్ ప్రధాని హసీనాపై పోరాడింది 26 ఏళ్ల కుర్రాడా..!



ఇంటర్నెట్‌డెస్క్: బంగ్లాదేశ్ లో ఏకంగా ప్రభుత్వాన్ని మార్చే స్థాయి ఆందోళనలు నిర్వహించింది ఓ 26 ఏళ్ల కుర్రాడు. చిన్న ఆందోళనగా మొదలైన రిజర్వేషన్ల ఉద్యమం ఏకంగా ప్రధాని హసీనా భవితవ్యాన్ని అంధకారం చేసింది. బంగ్లాదేశ్ పతాకాన్ని నుదుటకు చుట్టుకొని తరచూ ఆందోళనల్లో మీడియాకు కనిపించాడు. మొత్తం ఉద్యమాన్ని సమన్వయం చేశాడు. ఆ యువకుడి పేరు నహిద్ ఇస్లామ్. అతడు ఢాకా విశ్వవిద్యాలయంలో సోషియాలజీ విద్యార్థి. ఈ ఏడాది జులైలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నహిద్, మరికొందరు విద్యార్థులు ఆందోళన చేస్తుండటంతో పోలీసులు అరెస్టు చేశారు. తొలిసారి అతడు బంగ్లాదేశ్ ప్రజల దృష్టిని అప్పుడే ఆకర్షించాడు. ఆ తర్వాత అదే ఉద్యమం తుపానుగా మారి ప్రభుత్వాన్ని చుట్టుముట్టింది. ఈ ఘర్షణల్లో 300 మంది విద్యార్థులు మరణించారు. వీరిలో చాలా మంది వివిధ విశ్వవిద్యాలయాలకు చెందినవారు. దీంతో హసీనా పదవికి రాజీనామా చేసి భారత్‌కు వెళ్లిపోయారు. నేటి సాయంత్రం నహిద్, ఇతర విద్యార్థి నాయకులు ఆర్మీ చీఫ్ జనరల్ వకార్ ఉజ్ జమాన్‌తో భేటీ కానున్నారు. ఈ విద్యార్థుల బృందం సైన్యం లేదా ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని అంగీకరించడంలేదు. నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనిస్ చీఫ్ అడ్వైజర్‌గా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. విద్యార్థి ఉద్యమం ఆమోదం లేని ఏ ప్రభుత్వాన్ని అంగీకరించబోమని నహిద్ ఫేస్‌బుక్ పోస్టులో పేర్కొన్నాడు. 1998 సంవత్సరంలో ఢాకాలో నహిద్ జన్మించాడు. అతడి తండ్రి ఓ టీచర్. అతడి సోదరుడు నఖిబ్. అతడు కూడా ఈ ఉద్యమంలో పాల్గొన్నాడు. తన సోదరుడి గురించి నఖిబ్ చెబుతూ "అతడు ఎప్పుడూ దేశంలో మార్పు రావాలని ఆకాంక్షించేవాడు. అతడిని పోలీసులు అరెస్టు చేసి.. స్పృహతప్పేలా హింసించారు. ఆ తర్వాత రోడ్డుపై పారేశారు. అయినా భయపడకుండా పోరాటాన్ని కొనసాగించాడు" అని పేర్కొన్నాడు.

# బ్రిటన్‌లో నిరసనలు.. భారతీయులకు కేంద్రం అడ్వైజరీ



ఇంటర్నెట్ డెస్క్: వలస వ్యతిరేక గ్రూపులు బ్రిటన్‌లోని పలు నగరాలు, పట్టణాల్లో చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. అవి దేశమంతా విస్తరించాయి. ఈ తరుణంలో అక్కడున్న భారతీయులను కేంద్రం అప్రమత్తం చేసింది. ఈ మేరకు లండన్‌లోని భారత రాయబార కార్యాలయం అడ్వైజరీని జారీ చేసింది. "యూకేలోని పలు ప్రాంతాల్లో ఇటీవల జరిగిన అల్లర్ల గురించి భారత ప్రయాణికులకు తెలిసే ఉంటుంది. లండన్‌లోని భారత రాయబార కార్యాలయం పరిస్థితిని నిశితంగా గమనిస్తోంది. భారత్ నుంచి వచ్చే పర్యటకులు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నాం. స్థానిక మీడియా సంస్థలు, భద్రతా ఏజెన్సీలు ఇచ్చే సూచనలను అనుసరించాలి. నిరసనలు జరుగుతోన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలి" అని హై కమిషన్ సూచించింది. ఇంగ్లాండ్‌లో కొద్దిరోజుల క్రితం ఓ డ్యాన్స్ క్లాస్‌పై దుండగులు చిన్నారులపై కత్తులతో దాడి చేయడం సంచలనం రేపింది. ఆ ఘటనలో ముగ్గురు చిన్నారులు మృతిచెందడం దేశవ్యాప్తంగా ఆందోళనలకు కారణమైంది. అది కాస్తా వలస వ్యతిరేక నిరసనలకు దారితీసింది. మాంచెస్టర్, నాటింగ్‌హం, బెల్‌ఫాస్ట్, స్టోక్ ఆన్ ట్రెంట్, బ్లాక్‌పూల్, లీడ్స్, బ్రిస్టల్, హల్, లివర్‌పూల్‌లలో నిరసనల సందర్భంగా ఆందోళనకారులు పోలీసులతో ఘర్షణకు దిగారు. రాళ్లు రువ్వడం, బాణసంచా వెలిగించి విసరడం వంటి చర్యలతోపాటు శరణార్థులకు ఆశ్రయం కల్పిస్తున్న హోటల్‌పై దాడి చేశారు. ఆందోళనకారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించిన ప్రధానమంత్రి కీర్ స్టార్మర్.. అధికారులకు పూర్తి మద్దతు తెలిపారు. శరణార్థులకు ఆశ్రయం కల్పిస్తున్న హోటల్‌పై దాడిని ఖండించారు. హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్న వారు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని హోం మంత్రి కూపర్ హెచ్చరించిన సంగతి తెలిసిందే.

# ఢిల్లీ లిక్కర్ పాలసీ సీబీఐ కేసులో కీలక పరిణామం



ఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ పాలసీ సీబీఐ కేసులో దాఖలు చేసిన డీఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను ఎమ్మెల్సీ కవిత వెనక్కి తీసుకున్నారు. ఇదే పిటిషన్‌పై సోమవారం రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ జరగాల్సి ఉంది. కానీ తన తరుపున వాదించే సీనియర్ న్యాయవాదులు అందుబాటులో లేకపోవడంతో మరో రోజు విచారణ చేపట్టాలని కోరారు. కానీ అనూహ్యంగా ఈ రోజు పిటిషన్‌ను ఉప సంహరించుకున్నారు. అయితే పిటిషన్ విత్‌డ్రాలో కవిత బెయిల్ కోసం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు ప్రధాన కారణం సుప్రీం కోర్టును ఆశ్రయించి.. అక్కడి నుంచి బెయిల్ పొందేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా రౌస్ అవెన్యూ కోర్టులో దాఖలు చేసిన డీఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.

## కవితకు దెబ్బ మీద దెబ్బ

మరోవైపు మద్యం పాలసీ కేసులో సీబీఐ, ఈడీ కేసుల్లో బెయిల్ కావాలని కోరుతూ కవిత రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన కోర్టు బెయిల్ తిరస్కరించింది. విచారణ సమయంలో కవితకు బెయిల్ ఇవ్వకూడదని దర్యాప్తు సంస్థలు కోర్టులో తమ వాదనలు వినిపించాయి. ఆమె ప్రభావవంతమైన వ్యక్తి కాబట్టి సాక్ష్యాలు,సాక్ష్యులన్నీ తారుమారు అయ్యే అవకాశం ఉందని, బెయిల్ ఇవ్వొద్దని తెలిపాయి. ఈ అంశాలను పరిణగలోకి తీసుకున్న కోర్టు బెయిల్‌ను తిరస్కరించింది.

## చివరి అస్త్రంగా డీఫాల్ట్ బెయిల్ పిటిషన్.. అంతలోనే

ఆ తర్వాత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ కూడా కవితకు చుక్కెదురైంది. దీంతో న్యాయ బద్ధంగా బెయిల్ పొందేందుకు రౌస్ అవెన్యూ కోర్టులో కవిత డీఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. సీబీఐ ఛార్జ్ షీట్‌లో తప్పులు ఉన్నాయని జులై 6న కవిత దాఖలు చేసిన డీఫాల్ట్ బెయిల్ పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే ఆ ఛార్జ్‌షీట్‌లో తప్పులు లేవని సీబీఐ తరుపు లాయర్లు కోర్టులో వాదించారు. ఇప్పటికే సీబీఐ ఛార్జ్ షీట్‌ను జులై 22న పరిగణలోకి కోర్టు పరిగణలోకి తీసుకుంది. ఈ పిటిషన్‌పై రౌస్ అవెన్యూ కోర్టులో సోమవారం విచారణ జగింది.

## సుప్రీం కోర్టుకు కవిత

విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు అందుబాటులో లేనందున విచారణ వాయిదా వేయాలని ఆమె తరఫు న్యాయవాది రౌజ్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజాకు విన్నవించారు. దాంతో న్యాయమూర్తి ఈ కేసును చివరిసారి వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. బుధవారం విచారణ సమయంలో వాదనలు వినిపించకపోతే పిటిషన్‌ను వెనక్కు తీసుకోవాలని న్యాయవాదికి సూచించారు. ఈ కేసు విచారణ ఇదివరకు రెండుసార్లు వాయిదా పడిన నేపథ్యంలో న్యాయమూర్తి ఈ వ్యాఖ్య చేశారు. ఆగస్ట్ 9కి వాయిదా వేశారు. రేపు కోర్టులో విచారణ జరగనుండగా.. అనూహ్యంగా డీఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారు. త్వరలోనే సుప్రీం కోర్టును ఆశ్రయించనున్నారు.

# అమరవీరులను గుర్తుచేసే ఆరు ప్రాంతాలు

1947, ఆగస్టు 15న బ్రిటిష్ పాలన నుండి భారతదేశానికి విముక్తి లభించింది. ఆరోజు నుంచి ప్రతీయేటా ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దేశ స్వాతంత్ర్యం కోసం పలువురు సమరయోధులు పోరాటాలు సాగించారు. వీరి త్యాగానికి గుర్తుగా దేశంలోని పలు ప్రాంతాల్లో స్మారకాలు ఉన్నాయి. ఇదేవిధంగా దేశం కోసం ప్రాణాలర్పించిన వారి స్మారకాలు కూడా మనకు కనిపిస్తాయి. ఆగస్టు 15న ఆయా ప్రాంతాల్లో స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పిస్తారు.










### 1. కార్గిల్ వార్ మెమోరియల్ (లధాఖ్)

పాకిస్తాన్‌తో జరిగిన కార్గిల్ యుద్ధంలో అమరులైనవారి గౌరవార్థం 1990ల చివరలో భారత సైన్యం కార్గిల్ వార్ మెమోరియల్‌ని నిర్మించింది. ఈ స్మారక చిహ్నంపై యుద్ధంలో వీరమరణం పొందిన భారతీయ సైనికులందరి పేర్లను చెక్కారు.

### 2. ఎర్రకోట (ఢిల్లీ)

ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత ప్రధాని ఎర్రకోటపై జెండాను ఎగురవేసి, జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, దేశ మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఎర్రకోట నుంచి ప్రసంగించారు. ఈ ఎర్రకోటను షాజహాన్ నిర్మించారు. ఎరుపు రంగు ఇసుకరాయితో నిర్మించినందున దీనికి ఎర్రకోట అని పేరు పెట్టారు.

### 3. జలియన్ వాలా బాగ్ (అమృత్‌సర్)

1919లో జలియన్‌వాలాబాగ్‌లో స్వాతంత్ర్య సమరయోధులు రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఎటువంటి హెచ్చరిక లేకుండా జనరల్ డయ్యర్ కాల్పులు జరపాలని ఆదేశించాడు. నాటి జలియన్ వాలాబాగ్ మారణకాండలో వందల మంది అమరులయ్యారు. వారి జ్ఞాపకార్థం జలియన్‌వాలాబాగ్‌లో స్మారక చిహ్నం నిర్మించారు.

### 4. ఇండియా గేట్(ఢిల్లీ)

దేశ రాజధాని ఢిల్లీ మధ్యలో ఉన్న ఇండియా గేట్ మొదటి ప్రపంచ యుద్ధంతో పాటు ఆంగ్లో-ఆఫ్ఘన్ యుద్ధంలో ప్రాణాలను అర్పించిన 82 వేల మంది భారతీయ ఆర్మీ సైనికుల గౌరవార్థం నిర్మితమయ్యింది. ఈ అమరవీరుల పేర్లు ఇండియా గేట్ గోడలపై కనిపిస్తాయి.

### 5. పోరుబందర్(గుజరాత్)

గుజరాత్‌లోని పోర్‌బందర్ జాతిపిత మహాత్మా గాంధీ జన్మస్థలం. కీర్తి మందిర్, మహాత్మా గాంధీ నివసించిన ఇల్లు ఇక్కడ ఉన్నాయి. వీటిని గాంధీ జీవితంతో పాటు ఆయన రచనలను వివరించే మ్యూజియంలుగా మార్చారు.

### 6. చంద్రశేఖర్ ఆజాద్ పార్క్ (ప్రయాగ్‌రాజ్)

1931లో చంద్రశేఖర్ ఆజాద్ ఈ ప్రయాగ్‌రాజ్ పార్కులో బ్రిటిష్ సైనికులతో పోరాడారు. అతను తన 25 ఏళ్ల వయస్సులోనే జీవితాన్ని త్యాగం చేశారు. చంద్రశేఖర్ ఆజాద్‌ను బ్రిటీష్ పోలీసులు చుట్టుముట్టినప్పుడు, వారి తూటాలకు బలికావడం ఇష్టం లేక ఈ పార్కులో తనను తాను తుపాకీతో కాల్చుకున్నారు. ఈ పార్కులో చంద్రశేఖర్ ఆజాద్ విగ్రహం ఉంది.

# అక్వేరియం ఏమైనట్టు!.. రెండు సార్లు టెండర్లు పిలిచినా స్పందన



హైదరాబాద్: అక్వా మెరైన్ పార్కు..హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టన్నెల్ అక్వేరియం ప్రాజెక్టు ఇది. కొత్వాల్‌గూడ ఎకో పార్కులో అత్యాధునిక హంగులతో అక్వేరియం నిర్మాణానికి హెచ్ఎండీఏ అప్పట్లో ప్రణాళికలను రూపొందించింది. ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని తలపెట్టింది. కానీ ఏళ్లు గడిచినా ఆ ప్రాజెక్టు ఆచరణకు నోచలేదు. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంలో నిర్మించాలని భావించారు. రెండుసార్లు టెండర్లు కూడా ఆహ్వానించారు. కానీ నిర్మాణ సంస్థల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లభించలేదు. ప్రస్తుతం ఎకోపార్కు తుది దశకు చేరుకుంది. కానీ టన్నెల్ అక్వేరియం ఏర్పాటు మాత్రం పెండింగ్ జాబితాలో పడిపోయింది. కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ఇటీవల హెచ్ఎండీఏ చేపట్టిన పలు అభివృద్ధి ప్రాజెక్టులను, పార్కులను పరిశీలించారు. ఈ క్రమంలో గత ప్రభుత్వంలో ప్రతిపాదించిన టన్నెల్ అక్వేరియంపైన ప్రస్తుతం ఎలా ముందుకు వెళ్లనున్నదనేది చర్చనీయాంశంగా మారింది. సుమారు రూ.150 కోట్లతో ప్రతిపాదించిన అక్వేరియం ప్రతిపాదన ఉన్నట్లా? లేనట్లా అనే అంశంపైనా సందిగ్ధం నెలకొంది.

## నగర పర్యాటకానికి మణిహారం....

హిమాయత్‌సాగర్‌కు చేరువలో హెచ్ఎండీఏ 85 ఎకరాల విస్తీర్ణంలో కొత్వాల్‌గూడ ఎకోపార్కు నిర్మాణం చేపట్టింది. నగరవాసులకు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ఒక అందమైన, ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగించే విధంగా పార్కును విస్తరించారు. ఈ పార్కులోనే సుమారు 4.27 ఎకరాల్లో టన్నెల్ అక్వేరియం ఏర్పాటుకు సన్నాహాలు చేపట్టారు. ఇందుకోసం దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అక్వేరియంలపైన అధికారులు అధ్యయనం కూడా చేశారు. ఇప్పటి వరకు ఉన్న అన్ని అక్వా మెరైన్ పార్కుల కంటే మరిన్ని ఆధునిక హంగులతో దీన్ని అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. కానీ పీపీపీ పద్ధతిలో ప్రతిపాదించిన ఈ భారీ అక్వేరియం నిర్మాణానికి కాంట్రాక్టు సంస్థలు ముందుకు రాలేదు. గత సంవత్సరం రెండుసార్లు టెండర్లు పిలిచారు. స్పందన రాకపోవడంతో కొంతమంది ఆసక్తి కలిగిన డెవలపర్లతో ప్రీ బిడ్ సమావేశాన్ని కూడా ఏర్పాటు చేశారు. కానీ వారి నుంచీ పెద్దగా స్పందన కనిపించలేదు. దీంతో ఈ ప్రాజెక్టు పెండింగ్ జాబితాలో పడిపోయింది. దీనిపై మరోసారి ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపైన అధికారులు ప్రస్తుతం సమాలోచనలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ ప్రాజెక్టును పూర్తిగా పెట్టేయడమా లేక, మరోసారి ఆసక్తి ఉన్న నిర్మాణ సంస్థల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి విధి విధానాల్లో మార్పులు చేయడమా అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారినట్లు అధికారులు తెలిపారు. కొద్ది రోజుల్లోనే ఈ ప్రాజెక్టుపైన స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## రంగు రంగుల చేపలతో...

కొత్వాల్‌గూడ ఎకో పార్కు ఏర్పాటు కోసం, చెన్నై వీజీటీ మెరైన్‌పార్కు, అహ్మదాబాద్ సైన్స్‌సిటీ ప్రాజెక్టులపైన అధికారులు అధ్యయనం చేశారు. ఆ తరువాత దేశంలోనే అతి పెద్ద టన్నెల్ పార్కుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను రూపొందించారు. వేయి రకాల రంగు రంగుల చేపలు, మెరైన్ స్పీసెస్, బహుళ టన్నెల్స్‌తో ఈ మెగా అక్వా మెరైన్ పార్కును అందంగా తీర్చి దిద్దాలని భావించారు. షార్క్ చేపల నుంచి డాల్ఫిన్‌ల వరకు ఉంటాయి. ఇది సందర్శకులకు ఒక అద్భుతమైన అనుభూతినిచ్చే విధంగా, అతి పెద్ద జలాశయం అడుగున పర్యటిస్తూ వీక్షిస్తున్న అనుభూతి కలిగించే విధంగా ఉంటుంది. అలాగే అక్వేరియంను దగ్గరి నుంచి వీక్షించేందుకు అనుగుణంగా ఒక రెస్టారెంట్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అతి పెద్ద డోమ్ థియేటర్, సెవెన్ డీ థియేటర్, వర్చువల్ అక్వేరియం, టచ్ ట్యాంక్స్, హెల్మెట్ అక్వేరియం వంటివి ఏర్పాటు చేసేందుకు సైతం అప్పట్లో ప్రణాళికలను రూపొందించారు. పిల్లల కోసం కియోస్క్‌లను కూడా ఏర్పాటు చేయవలసి ఉంటుంది. కనీసం 2500 మంది ఒకేసారి సందర్శించేందుకు వీలుగా సుమారు 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలని భావించారు. అక్వేరియంలో ఏర్పాటు చేసే టన్నెల్ ట్యాంక్ మలుపు 180 డిగ్రీల కోణంలో ఉంటుంది. కనీసం 100 మీటర్ల పొడవు, 3.5 మీటర్ల వెడల్పు వాక్ వేలతో టన్నెల్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. మొత్తం అక్వేరియం సుమారు 3 వేల మిలియన్ లీటర్ల నీటి సామర్థ్యానికి తగ్గకుండా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

# నాడు పారదర్శక ప్రజాపాలన

## విద్య, వైద్యం, పౌరసేవలు, సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమిచ్చిన వైఎస్ జగన్

అమరావతి: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వివక్ష లేని పారదర్శక పాలన అందించాలని 2019 జూలై 24వ తేదీన నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. తాజాగా సీఎం చంద్రబాబు అందుకు పూర్తి భిన్నంగా తన హయాంలో రాజకీయ పాలనే ఉంటుందని కలెక్టర్లకు మార్గనిర్దేశం చేయడం గమనార్హం. ప్రజలకిచ్చిన నవరత్నాల హామీల అమలు లక్ష్యంగా ప్రతి మంత్రి, అధికారి వద్ద మేనిఫెస్టో ఉండాలని, అందుకు అనుగుణంగా వాగ్దానాలను నెరవేర్చాలని కలెక్టర్లతో తొలి సదస్సులో వైఎస్ జగన్ నిర్దేశించారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు హామీల అమలు గురించి ప్రస్తావించకుండా.. ఆత్మస్తుతి, పరనిందను ప్రోత్సహించారు. గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటు, వలంటీర్ల నియామకంతోపాటు వైద్య, ఆరోగ్య రంగం, పౌరుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ నాడు వైఎస్ జగన్ కలెక్టర్ల సదస్సు నిర్వహించారు. సీఎం చంద్రబాబు మాత్రం గత ప్రభుత్వాన్ని తప్పుబట్టడమే లక్ష్యంగా కలెక్టర్ల సదస్సును రాజకీయ సమావేశంగా మార్చేశారు. రహదారుల నిర్మాణాన్ని ప్రైవేట్ పరం చేయడం, ఆస్పత్రుల్లో సేవలు, రోడ్ల నిర్వహణను అవుట్ సోర్సింగ్‌కు అప్పగించడమే ధ్యేయమని తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. నవరత్నాలను పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా, సిఫారసులతో పనిలేకుండా, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంతృప్త స్థాయిలో లబ్ధి చేకూర్చాలని నాడు కలెక్టర్లకు వైఎస్ జగన్ సూచించారు. ప్రభుత్వరంగంలో విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయడానికి వైఎస్ జగన్ ప్రాధాన్యం ఇవ్వగా ఇప్పుడు చంద్రబాబు వాటిని ప్రైవేట్ పరం చేయడమే లక్ష్యంగా సాగుతున్నట్లు స్పష్టమవుతోంది.



## పాలకులం కాదు.. ప్రజా సేవకులం

నాడు హామీలన్నీ నెరవేర్చాలనే సంకల్పంతో వైఎస్ జగన్ కలెక్టర్ల సదస్సు నిర్వహించగా నేడు చంద్రబాబు ఆ ఊసే ఎత్తకుండా జాగ్రత్త పడ్డారు. ప్రభుత్వం వద్ద డబ్బుల్లేవని, ఆలోచనలు మాత్రం ఉన్నాయని, అధికారులు సహకరించాలని చంద్రబాబు చెప్పారు. పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి అవసరమైన భూములను సత్వరం గుర్తించాలని నాడు వైఎస్ జగన్ అధికారులకు సూచిస్తే చీప్ పాపులారిటీ కోసం ఏపీఐఐసీ భూములను తీసుకున్నారంటూ సీఎం చంద్రబాబు నిరుపేదలను అవమానించారు. ఇంటికే రేషన్ పంపిణీపై నాడు వైఎస్ జగన్ కలెక్టర్ల సదస్సులో చర్చిస్తే ఇప్పుడు చంద్రబాబు ఆ విధానాన్ని తప్పుబట్టారు. సరుకులు రేషన్ దుకాణాల్లో ఉంటే ప్రజలకు తీరినప్పుడు వెళ్లి తీసుకునేవారని చెప్పారు. అక్రమాలను సహించేది లేదని, మనం పాలకులం కాదు.. ప్రజా సేవకులం అనే సందేశాన్ని కలెక్టర్ల సదస్సు ద్వారా నాడు వైఎస్ జగన్ ఇచ్చారు. తాజాగా సీఎం చంద్రబాబు అంతా రాజకీయ పాలనే ఉంటుందని కలెక్టర్లకు స్పష్టం చేయడం ద్వారా ఇక అంతా రాజకీయాలే చేస్తామని, ఆ కోణంలోనే చూస్తామనే సంకేతాలిచ్చారు. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితమని, ఆ తరువాత ప్రజల ప్రయోజనాలు, సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా వ్యవహరిస్తామని వైఎస్ జగన్ పలుదఫాలు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. రైతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు నవరత్నాల ఫలాలను అందించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ఇందులో రాజకీయ పార్టీలు, కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా వ్యవహరించాలని వైఎస్ జగన్ నాడు యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు.

# ఇకపై భరించలేను..

## రిటైర్మెంట్ ప్రకటించిన స్టార్ ఇండియా షట్లర్




'ఇంకోసారి నేను దీని జోలికి వెళ్లలేను..' అని అశ్విని పొన్నప్ప తన ఒలింపిక్ కెరీర్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్న తర్వాత చెబుతోంది. మల్టీ-స్పోర్ట్ ఈవెంట్‌లో ఆస్ట్రేలియాకు చెందిన సెత్యానా మపాసా మరియు ఏంజెలా యుతో జరిగిన గ్రూప్ సి బ్యాడ్మింటన్ మహిళల జట్టు మ్యాచ్‌లో నిరాశపరిచిన తర్వాత స్టార్ ఇండియా షట్లర్ అశ్విని పొన్నప్ప ఒలింపిక్స్ నుండి రిటైర్మెంట్ ప్రకటించింది .మ్యాచ్ అనంతరం పొన్నప్ప మాట్లాడుతూ.. దాన్ని అధిగమించేందుకు ఎంతో మానసిక శక్తి అవసరమని చెప్పింది. భారత షట్లర్ ఇకపై ఇంత ఒత్తిడి భరించలేనని పేర్కొంది. "ఎమోషనల్‌గానూ, మెంటల్‌గానూ చాలా ఇబ్బంది పడతాను, నేను మళ్ళీ దీని జోలికి వెళ్ళలేను. ఇది అంత తేలిక కాదు, మీరు కొంచెం చిన్నవారైతే ఇవన్నీ తీసుకోవచ్చు. ఇంత కాలం ఆడిన నేను ఇక భరించలేను" అని పొన్నప్ప పేర్కొంది . మహిళల టీమ్ ఈవెంట్‌లో, భారత మహిళల ద్వయం అశ్విని పొన్నప్ప మరియు తనీషా క్రాస్టో గ్రూప్ సిలో వరుసగా మూడోసారి ఓటమికి గురై నాలుగో స్థానంలో నిలిచి గ్రూప్ దశలోనే నిష్క్రమించారు. మంగళవారం జరిగిన వరుస గేమ్‌లలో 15-21, 10-21తో ఆస్ట్రేలియా ద్వయం సెత్యానా మపాసా, ఏంజెలా యుపై ఓటమిని చవిచూశారు. ఆస్ట్రేలియన్ జట్టుతో జరిగిన ఔటింగ్‌లో భారత మహిళల ద్వయం పోరాడింది. ఇదిలావుండగా, పారిస్ ఒలింపిక్స్‌లో మంగళవారం ఇండోనేషియాకు చెందిన ఫజర్ అల్ఫియాన్ మరియు ముహమ్మద్ రియాన్ ఆర్డియాంటోపై వరుస గేమ్‌ల విజయంతో భారతదేశపు స్టార్ పురుషుల ద్వయం సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి మరియు చిరాగ్ శెట్టి బ్యాడ్మింటన్ డబుల్స్‌లో క్వార్టర్స్‌కు టిక్కెట్టును పంచుకున్నారు . మూడో ర్యాంక్‌లో ఉన్న భారత జోడీ గ్రూప్ సి లీడర్‌లుగా నాకౌట్‌కు చేరుకుంది. 40 నిమిషాల పాటు జరిగిన గేమ్‌లో సాత్విక్ మరియు చిరాగ్ ఆల్-ఇంగ్లండ్ విజేతలపై ఆధిపత్యం చెలాయించారు మరియు 21-13, 21-13 తేడాతో విజయం సాధించారు. సునాయాస విజయాన్ని నమోదు చేసేందుకు భారత జోడీ ఒక్కో పాయింట్ కోసం తీవ్రంగా శ్రమించింది. తొలి గేమ్‌లో భారత జోడీ 5-3తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది, అయితే ఇండోనేషియా జంట వరుసగా రెండు పాయింట్లు సాధించి స్కోర్‌లైన్‌ను 5-5తో సమం చేసింది. ఇది ముందుకు వెనుకకు వ్యవహారంగా మారింది, కానీ భారత ద్వయం వారి గేమ్‌ను పెంచింది మరియు చివరికి నాలుగు పాయింట్ల ఆధిక్యాన్ని సాధించింది, స్కోర్‌లైన్‌ను 15-11 చేసింది. వీరిద్దరూ వెనుదిరిగి చూడలేదు మరియు మొదటి గేమ్‌లో 21-13తో విజయం సాధించారు. ప్రతి పాయింట్‌కి రెండు జోడీలు నెక్-టు-నెక్‌గా వెళ్లడంతో రెండవ గేమ్ ఇదే కథ. 11-8 తర్వాత, భారత స్టార్ ద్వయం వరుసగా ఆరు పాయింట్లు సాధించి నాకౌట్ దశకు చేరుకుంది. వారు ఆటను ఛేదించడానికి షాట్‌ల వర్షం కురిపించడంతో కనికరంలేని, దూకుడు కొనసాగింది.

# ఒలింపిక్స్‌లో పతకం గెల్చిన స్విమ్మర్..

## ఉద్వేగానికి గురిచేసిన భార్య సర్‌ప్రైజ్




ఇంటర్నెట్‌డెస్క్: ఒలింపిక్స్‌లో పతకం గెలిచిన ఆనందంలో ఉన్న ఓ క్రీడాకారుడికి ఆయన సతీమణి ఇచ్చిన సర్‌ప్రైజ్ ఉద్వేగానికి గురిచేసింది. స్టాండ్స్‌లో నుంచి ఆమె ప్రదర్శించిన కార్డును చూసి అతడి పతకానందం రెట్టింపైంది. ఇంతకీ విషయం ఏంటంటే.. యూఎస్ స్విమ్మర్ ర్యాన్ మర్ఫీ 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. విజేతలకు మెడల్స్ అందిస్తోన్న తరుణంలో ర్యాన్.. స్టాండ్స్‌లో ఉన్న తన భార్య బ్రిడ్జెట్ వైపు చూశాడు. అప్పుడు ఆమె ఒక ప్లకార్డును చూపించింది. దాని మీద ఉన్న సందేశం చదివి అతడు ఉద్వేగానికి గురయ్యాడు. "ర్యాన్..మనకు అమ్మాయి పుట్టబోతోంది" అని దానిపై రాసి ఉంది. తన బేబీ జెండర్ గురించి ఆ స్విమ్మర్‌కు అప్పుడే తెలిసింది. తన భర్త పతకం గెలిచిన వేళ.. బ్రిడ్జెట్ అతడికి మరపురాని సర్‌ప్రైజ్ ఇచ్చింది. టీమ్ యూఎస్‌ఏ ఇన్‌స్టాగ్రాం ఖాతాలో ఈ దృశ్యాలను షేర్ చేశారు. దీనిపై నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపించారు. వారిలో లెజెండ్ స్విమ్మర్ మైఖెల్ ఫెల్ప్స్ కూడా ఉన్నాడు. "ఏ పతకమైనా దీనిముందు తక్కువే. కంగ్రాట్స్ మర్ఫీ " అని మరో మాజీ స్విమ్మర్ పోస్టు చేశారు. 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో.. పారిస్‌తో కలిపి వరుసగా మూడోసారి పతకాన్ని సాధించాడు. రియోలో గోల్డ్, టోక్యోలో కాంస్యం దక్కించుకున్నాడు. ఇక ఈ విశ్వక్రీడల్లో అతడు 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో పోటీ పడనున్నాడు.ం

# ఒలింపిక్స్ లో రైతు బిడ్డ పతకం తెచ్చాడు

షూటింగ్ అంటేనే ఖరీదైన క్రీడ.. కానీ తనది




వ్యవసాయ ఆధారిత కుటుంబం.. ప్రతి రోజు 35 కిలో మీటర్లు ప్రయాణించి షూటింగ్ రేంజ్‌కు వెళ్లాలి. బస్సులో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు.. ఏదైనా సొంత వాహనంపై వెళ్లాలంటే అనుకూలించని ఆర్థిక పరిస్థితులు.. అయినా ఇవేమి ఆ యువ షూటర్ కలకు అడ్డుగా నిలవలేదు. ఇలాంటి కష్టాలను చూసి అతనేమి షూటింగ్ నుంచి పారిపోలేదు. ఎక్కడైతే నిరాశపడ్డాడో అక్కడే తనకంటూ ఓ గమ్యాన్ని సృష్టించుకున్నాడు.. ఎక్కడైతే పతకం కోల్పోయాడో.. అక్కడే తొలి ఒలింపిక్ మెడల్ గెలిచాడు. అతనే హర్యానాకు చెందిన 22 ఏండ్ల యంగ్ షూటర్ సరబ్‌జోత్ సింగ్.

### తండ్రి త్యాగం.. తాత

అండపారిస్‌లో మూడు రోజుల కిందట మెన్స్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్ చేరడంలో సరబ్‌జోత్ విఫలమయ్యాడు. మను భాకర్ పతకం నెగ్గడంతో ఆమెతో కలిసి బరిలోకి దిగాలంటే నైపుణ్యాన్ని పెంచుకోవాలి. సరిగ్గా అదే దిశగా ఆలోచన చేసిన సరబ్ ఉన్న ఫలంగా ప్రాక్టీస్ పెంచాడు. మనుతో సమంగా గురి తప్పకుండా బుల్లెట్లు దింపాడు. దాని ఫలితమే ఒలింపిక్స్‌లో తొలి పతకాన్ని అందుకోవడంతో పాటు ఇండియాకు రెండో మెడల్ రావడంలో భాగమయ్యాడు. సరబ్‌ది అంబాలాలోని ధీన్ అనే చిన్న గ్రామం. వసతి, సౌకర్యాలు కూడా అంతంత మాత్రమే. అలాంటి గ్రామం నుంచి ఒలింపిక్ షూటర్ వస్తాడని ఎవరూ ఊహించి ఉండరు. 2016లో షూటింగ్ మొదలుపెట్టిన సరబ్‌కు ఆరంభంలో అన్నీ కష్టాలే. ప్రతి రోజు 35 కిలో మీటర్లు ప్రయాణించి అంబాలాలోని అభిషేక్ రాణా రేంజ్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఎక్విప్‌మెంట్‌తో బస్సు ప్రయాణం తలకు మించిన భారంగా ఉండేది. దీనికి తోడు తండ్రి ఆదాయంతో కుటుంబ పోషణ మాత్రమే గడిచేది. కానీ ఖరీదైన షూటింగ్ పరికరాలు సమకూర్చుకోవడం కష్టమయ్యేది. కానీ అదే సమయంలో యూఎస్‌కు చెందిన తన తాత అండగా నిలిచాడు. రాజీ పడకుండా ఎప్పటికప్పుడు ఖరీదైన పరికరాలు అందించాడు. మూడేండ్ల తర్వాత చేతన్ అనే స్నేహితుడు తోడుగా నిలవడంతో సరబ్ వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. 2019 నుంచి ఖేలో ఇండియాలో భాగం కావడం కూడా సరబ్‌కు కలిసొచ్చింది. ప్రఖ్యాత కోచ్‌లతో కలిసి పని చేసే అవకాశం రావడంతో తన తప్పులను తెలుసుకుంటూ గురిపై పట్టు పెంచుకుని వరల్డ్ టోర్నీల్లో పతకాలు గెలిచాడు. అయితే మెగా గేమ్స్‌లో మెన్స్ కేటగిరీలో విఫలమైనప్పుడు మాత్రం తన పాత రోజులు గుర్తుకు వచ్చాయని సరబ్ చెప్పాడు. మొత్తానికి ఎనిమిదేండ్ల తర్వాత తన కల ఫలించినందుకు చాలా సంతోషంగా ఉందన్నాడు. ఫైనల్ తర్వాత.. మా నాన్న నా కోసం ఏం చేశాడు, మా తాత మద్దతు, నా కెరీర్‌లో మొదటి రెండేండ్లు బస్సులో ఒంటరి ప్రయాణం, స్నేహితుల అండ.. ఇప్పుడు ఒలింపిక్ పతకం ఇలా ప్రతి అంశం గుర్తుకు వచ్చింది. నా కోసం కష్టపడిన వీరందరికి నేను ఏమీ ఇవ్వగలను. నా తల్లిదండ్రుల జీవితాలు బాగుపడాలని మాత్రం ఆశిస్తున్నా.

# ఎదురులేని సాత్విక్-చిరాగ్ జోడీ




పారిస్: పురుషుల డబుల్స్ బ్యాడ్మింటన్ విభాగంలో భారత్‌కు చెందిన సాత్విక్ సాయిరాజ్‌చిరాగ్ శెట్టి మరో విజయం సాధించింది. మంగళవారం ఇండోనేషియాకు చెందిన మహ్మద్ రియాన్‌ఫజర్ అల్ఫియాన్ జంటతో జరిగిన పోరులో సాత్విక్ జంట జయభేరి మోగించింది. 40 నిమిషాల పాటు సాగిన పోరులో భారత జంట 2113, 2113 తేడాతో జయకేతనం ఎగుర వేసింది. ఆరంభం నుంచే భారత జోడీ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ప్రత్యర్థి జోడీకి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ముందుకు సాగింది. ఇదే క్రమంలో వరుసగా రెండు సెట్లు గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది.

# ఒలింపిక్స్ హాకీ క్వార్టర్ ఫైనల్స్ లో భారత్!




ప్రపంచ, ఒలింపిక్స్ మాజీ చాంపియన్ భారత్ వరుసగా రెండోసారి ఒలింపిక్ గేమ్స్ క్వార్టర్ ఫైనల్స్ కు చేరుకొంది. గ్రూప్ లీగ్ లో రెండోవిజయంతో నాకౌట్ రౌండ్లో చోటు ఖాయం చేసుకొంది. పారిస్ ఒలింపిక్స్ ఐదోరోజు పోటీలలో భారత్ కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. బ్యాడ్మింటన్, విలువిద్య వ్యక్తిగత విభాగాలతో పాటు..పురుషుల హాకీలో భారత్ మెరుగైన ఫలితాలు సాధించింది.

### ఐర్లాండ్ పై 2-0 గోల్స్ తో విజయం...

హర్మన్ ప్రీత్ సింగ్ నాయకత్వంలోని భారతజట్టు వరుసగా రెండో ఒలింపిక్స్ లో ఏదో ఒక పతకం సాధించాలన్న పట్టుదలతో పారిస్ ఒలింపిక్స్ బరిలో నిలిచింది. ఆస్ట్రేలియా, బెల్జియం, న్యూజిలాండ్, అర్జెంటీనా, ఐర్లాండ్ లాంటి హేమాహేమీజట్లతో కూడిన పూల్ -బీ లీగ్ మొదటి మూడురౌండ్ల మ్యాచ్ ల్లో భారత్ రెండు విజయాలతో అజేయంగా నిలిచింది. గ్రూప్ తొలిమ్యాచ్ లో న్యూజిలాండ్ పై గట్టిపోటీ ఎదుర్కొని విజయం సాధించిన భారత్..రెండోరౌండ్లో పవర్ ఫుల్ అర్జెంటీనాతో హెూరాహెూరీగా సాగిన పోరులో ఆఖరి నిముషం గోలుతో మ్యాచ్ ను 1-1తో డ్రాగా ముగించడం ద్వారా ఊపిరిపీల్చుకోగలిగింది.

### హర్మన్ ప్రీత్ డబుల్ ధమాకా...

ఐర్లాండ్ తో జరిగిన గ్రూపు మూడవ రౌండ్ పోటీలో సైతం భారత్ స్థాయికి తగ్గట్టుగా రాణించలేకపోయింది. మిగిలినజట్లతో పోల్చిచూస్తే అత్యంత బలహీనంగా ఉన్న ఐర్లాండ్ ను ఓడించడానికి భారత్ తుదివరకూ పోరాడాల్సి వచ్చింది. ఆట మొదటి భాగం 11, 19 నిముషాలలో కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ అందించిన పెనాల్టీ కార్నర్ గోల్స్ తో 2-0తో పైచేయి సాధించినా ..రెండో భాగంలో ఒక్కగోలూ చేయలేకపోయింది. పైగా ..ప్రత్యర్థి ఐర్లాండ్ కు 10 పెనాల్టీకార్నర్ లు సమర్పించుకొని..పటిష్టమైన డిఫెన్స్ తో కాచుకోవాల్సి వచ్చింది. భారత దిగ్గజ గోల్ కీపర్ శ్రీజేష్ మరోసారి తన అనుభవాన్నంతా ఎదుర్కొని ప్రత్యర్థిజట్టుకు గోల్ కాకుండా నిలువరించగలిగాడు. దీంతో భారత్ 2-0 గోల్స్ తో రెండో విజయం సాధించడం ద్వారా తన పాయింట్ల సంఖ్యను 7కు పెంచుకొంది.

### నాలుగు గోల్స్ తో హర్మన్ అగ్రస్థానంలో

భారతజట్టు మొదటి మూడు గేమ్ ల్లో సాధించిన మొత్తం 6 గోల్స్ లో భారత కెప్టెన్ కమ్ పెనాల్టీకార్నర్ స్పెషలిస్ట్ హర్మన్ ప్రీత్ సింగ్ ఒక్కడే నాలుగు గోల్స్ చేయడం ద్వారా టాపర్ గా నిలిచాడు. ఆడిన మొదటి మూడురౌండ్ల మ్యాచ్ ల్లోనూ అజేయంగా నిలవడం ద్వారా భారత్ 7 పాయింట్లతో పూల్ -బీ నుంచి క్వార్టర్ ఫైనల్స్ నాకౌట్ రౌండ్లో చోటు సంపాదించగలిగింది. గ్రూప్ ఆఖరి రెండు రౌండ్ల పోటీలలో దిగ్గజ ఆస్ట్రేలియా, బెల్జియం జట్లతో భారత్ పోటీపడాల్సి ఉంది. ఒలింపిక్ విజేత బెల్జియం, రన్నరప్ ఆస్ట్రేలియాజట్ల నుంచి భారతజట్టుకు అసలు సిసలు పరీక్ష ఎదురుకానుంది.

### ప్రి-క్వార్టర్ ఫైనల్లో పీవీ సింధు...

బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్ ప్రీ-క్వార్టర్ ఫైనల్స్ కు రెండు ఒలింపిక్స్ పతకాల విజేత, తెలుగుతేజం పీవీ సింధు అలవోకగా చేరుకొంది. గ్రూపులీగ్ లో వరుసగా రెండో గెలుపుతో నాకౌట్ రౌండ్లో అడుగుపెట్టింది. తన గ్రూపు ప్రారంభమ్యాచ్ లో మాల్దీవ్స్ ప్లేయర్ ఫతిమాత్ ను 21-9, 21-6తో చిత్తు చేయడం ద్వారా పతకం వేట ప్రారంభించిన సింధు..రౌండో మ్యాచ్ లో ఎస్తోనియా ప్లేయర్ క్రిస్టిన్ కుబాను కేవలం 32 నిముషాలలోనే ఓడించింది. 21-5, 21-10 పాయింట్లతో సింధు వరుసగా రెండో విజయం సాధించింది. క్వార్టర్ ఫైనల్స్ లో చోటు కోసం జరిగే ప్రీ-క్వార్టర్ ఫైనల్స్ పోరులో చైనా యువచాంపియన్ బింగ్ జియావోతో సింధు తలపడనుంది. గత ఒలింపిక్స్ కాంస్య పతకం పోటీలో బింగ్ జియావోను 21-13, 21-15తో అధిగమించిన సింధు ప్రస్తుత పారిస్ ఒలింపిక్స్ లో మాత్రం ప్రీ-క్వార్టర్ ఫైనల్స్ దశలోనే అదే ప్రత్యర్థితో తలపడనుంది. 2016 రియో ఒలింపిక్స్ లో రజత, 2020 టోక్యో ఒలింపిక్స్ లో కాంస్య పతకం సాధించిన సింధు..వరుసగా మూడో ఒలింపిక్స్ లో ఏదో ఒక పతకం సాధించాలన్న పట్టుదలతో ఉంది.

### సత్తాచాటిన భారత యువఆర్చర్లు....

విలువిద్య టీమ్ విభాగాలలో విఫలమైన భారత ఆర్చర్లు వ్యక్తిగత విభాగం పోటీలలో మాత్రం రాణించారు. మహిళల రికర్వ్ విభాగంలో భజన్ కౌర్, పురుషుల రికర్వ్ విభాగంలో తెలుగుతేజం ధీరజ్ బొమ్మదేవర వరుస విజయాలతో ప్రీ-క్వార్టర్ ఫైనల్స్ రౌండ్ చేరుకోగలిగారు. తన జీవితంలో తొలిసారిగా ఒలింపిక్స్ లో పాల్గొంటున్న భజన్ కౌర్ తొలిరౌండ్లో పోలెండ్ ప్లేయర్ వియోలెటా మిస్ జోర్ ను 6-0తో చిత్తు చేసింది. రెండోరౌండ్లో ఇండోనీసియాకు చెందిన సిఫా కమల్ నూర్ పిఫాను 7-3తోను అధిగమించింది పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర వరుస విజయాలతో ఆఖరి 16 రౌండ్ కు చేరుకొన్నాడు.

### పతకాలపట్టిక 35వ స్థానంలో భారత్...

పారిస్ ఒలింపిక్స్ 5వరోజు పోటీలు ముగిసే సమయానికి భారత్ 2 కాంస్యాలతో పతకాల పట్టిక 35వ స్థానంలో కొనసాగుతోంది. చైనా 7 స్వర్ణాలతో సహా మొత్తం 15 పతకాలతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. జపాన్ 7 స్వర్ణ, 2 రజత, 4 కాంస్యాలతో సహా 13 పతకాలతో రెండు, ఆతిథ్య ఫ్రాన్స్ 6 స్వర్ణ, 9 రజత, 4 కాంస్యాలతో సహా 19 పతకాలతో మూడు స్థానాలలో కొనసాగుతున్నాయి. ఆస్ట్రేలియా 6 స్వర్ణ, 4 రజత, 1 కాంస్యతో సహా 11 పతకాలతో నాలుగోస్థానంలో నిలిచింది. దక్షిణ కొరియా 5, అమెరికా 6 స్థానాలలో ఉన్నాయి. షూటింగ్ పిస్టల్ విభాగంలో భారత షూటర్ మను బాకర్ రెండు కాంస్య పతకాలు సాధించడంతో భారత్ పతకాల పట్టిక 35వ స్థానంలో నిలువగలిగింది.

# శ్రీలంకతో టీ-20 సిరీస్ లో భారత్ 'టాప్ గేర్'!

ప్రపంచ చాంపియన్ భారత్ శ్రీలంక గడ్డపై మరో టీ-20 సిరీస్ సాధించింది. కెప్టెన్ గా సూర్యకుమార్ తనజట్టును మరో సిరీస్ లో విజేతగా నిలిపాడు. ధూమ్ ధామ్ టీ-20 ఫార్మాట్లో నయాకోచ్ గౌతం గంభీర్, సరికొత్త కెప్టెన్ సూర్యకుమార్ ల నేతృత్వంలో తొలిసిరీస్ విజయంతో బోణీ కొట్టింది. శ్రీలంకతో జరుగుతున్న తీన్మార్ సిరీస్ మొదటి రెండుమ్యాచ్ ల్లోనే సిరీస్ విజయాన్ని ఖాయం చేసుకోగలిగింది.




### శ్రీలంకకు దెబ్బ మీద దెబ్బ....

టీ-20 ఫార్మాట్లో 8వ ర్యాంకర్ గా ఉన్న శ్రీలంక తొలి పోరులో గట్టి పోటీ ఇచ్చినా..మిడిలార్డర్ వైఫల్యంతో రెండో టీ-20లో తేలిపోయింది. సిరీస్ అవకాశాలను సజీవంగా నిలుపుకోవాలంటే నెగ్గితీరాల్సిన ఈ పోరును సైతం పల్లెకెలీ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగానే నిర్వహించారు. టాస్ నెగ్గి ముందుగా బ్యాటింగ్ కు దిగిన శ్రీలంక ఒక దశలో 2 వికెట్లకు 130 పరుగుల స్కోరుతో పటిష్టమైన స్థితిలో కనిపించినా..మిడిలార్డర్ కుప్పకూలడంతో 20 ఓవర్లలో 9 వికెట్లకు 161 పరుగుల స్కోరుకే పరిమితమయ్యింది. కుశాల్ పెరెరా 34 బంతుల్లో 53 పరుగులు, పతుమ్ నిస్సంకా 24 బంతుల్లో 32, కమిందు మెండిస్ 23 బంతుల్లో 26 పరుగులు సాధించారు. భారత బౌలర్లలో లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ 26 పరుగులిచ్చి 3 వికెట్లు, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ చెరో 2 వికెట్లు పడగొట్టారు.

### వానదెబ్బతో....

శ్రీలంక ఇన్నింగ్స్ ముగిసిన వెంటనే పడిన వర్షంతో చాలాసేపు ఆట నిలిచిపోయింది. దీంతో డక్ వర్త్ లూయిస్ విధానం పాటించడం ద్వారా భారతలక్ష్యాన్ని 8 ఓవర్లలో 78 పరుగులుగా నిర్ణయించారు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ 30, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 12 బంతుల్లో 4 ఫోర్లు, ఓ సిక్సర్, హార్దిక్ పాండ్యా 9 బంతుల్లో 4 ఫోర్లు, ఓసిక్సర్ తో22 పరుగులు సాధించడంతో మరో 9 బంతులు మిగిలిఉండగానే భారత్ 7 వికెట్ల విజయంతో సిరీస్ ను 2-0తో ఖాయం చేసుకోగలిగింది. భారత్ విజయంలో ప్రధాన పాత్ర వహించిన లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ కి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

### ఇదేజోరు కొనసాగిస్తాం- సూర్య...

టీ-20 ఫార్మాట్లో తమజట్టు ఇదే జోరు, దూకుడు కొనసాగిస్తుందని సిరీస్ విజయానంతరం భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ప్రకటించాడు. ప్రస్తుత సిరీస్ లోని తొలి టీ-20 ని 43 పరుగులతో గెలుచుకొన్న భారత్ రెండోమ్యాచ్ ను 7 వికెట్లతో సొంతం చేసుకోగలిగింది.

### యశస్వీ జైస్వాల్ 1000 పరుగుల రికార్డు...

భారతయువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ ప్రస్తుత సిరీస్ రెండోమ్యాచ్ లో 30 పరుగులు సాధించడం ద్వారా..ప్రస్తుత ఏడాదిలో వెయ్యి పరుగులు సాధించిన తొలి బ్యాటర్ గా రికార్డు నెలకొల్పాడు. క్రికెట్ మూడు ఫార్మాట్లలోనూ ఆడిన మ్యాచ్ ల ద్వారా 1000 పరుగుల మైలురాయిని చేరుకోగలిగాడు. కేవలం 13 అంతర్జాతీయ మ్యాచ్ ల్లోనే యశస్వీ ఈ అరుదైన రికార్డు నెలకొల్పగలిగాడు. యశస్వీ సాధించిన మొత్తం 1023 పరుగుల్లో 2 సెంచరీలు, 5 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 94.54 స్ట్రయిక్ రేటుతో 63.93 సగటుతో వెయ్యి పరుగుల మైలురాయిని చేరగలిగాడు. శ్రీలంక ఆటగాడు కుశల్ మెండిస్ 26 మ్యాచ్ ల్లో 888 పరుగులతో రెండు, అఫ్ఘన్ బ్యాటర్ ఇబ్రహీం జద్రాన్ 25 మ్యాచ్ ల్లో 844 పరుగులతో మూడు స్థానాలలో ఉన్నారు. ప్రస్తుత ఏడాదిలో 6 టెస్టులు, 11 ఇన్నింగ్స్ ఆడిన యశస్వి 74.00 సగటుతో740 పరుగులు సాధించాడు. ఇందులో రెండు ద్విశతకాలు,3 అర్ధశతకాలు ఉన్నాయి. అత్యధిక వ్యక్తిగత స్కోరు 214 నాటౌట్ కావడం విశేషం. 7 టీ-20 మ్యాచ్ ల్లో 175. 77 స్ట్రయిక్ రేటుతో 283 పరుగులు సాధించాడు. రెండు హాఫ్ సెంచరీలతో 47.16 సగటు నమోదు చేశాడు.

# భారత షూటర్ ను ఊరిస్తున్న అరుదైన రికార్డు..

పారిస్ ఒలింపిక్స్ లో భారత్ కు తొలి పతకం అందించిన యువషూటర్ మను బాకర్ మరో పతకంతో పాటు అరుదైన రికార్డుకు గురిపెట్టింది. ఫ్రెంచ్ రాజధాని పారిస్ నగరం వేదికగా ప్రారంభమైన 2024 ఒలింపిక్స్ క్రీడల తొలిరోజునే భారత్ కు పతకం అందించిన మహిళా షూటర్ మను బాకర్ టీమ్ విభాగంలో సైతం మరో పతకం అందించాలన్న పట్టుదలతో ఉంది.

### 12 ఏళ్ల తర్వాత షూటింగ్ లో మరో పతకం...

ఒలింపిక్స్ షూటింగ్ లో చివరిసారిగా 2012 గేమ్స్ లో పతకం నెగ్గిన భారత్ మరో పతకం కోసం 2024 పారిస్ ఒలింపిక్స్ వరకూ వేచిచూడాల్సి వచ్చింది. 10 మీటర్ల ఏర్ పిస్టల్ షూటింగ్ లో వివిధ దేశాలకు చెందిన ప్రపంచ మేటి తొమ్మిది మంది షూటర్లతో పోటీకి దిగిన 22 సంవత్సరాల మను బాకర్ మూడోస్థానంలో నిలవడం ద్వారా కాంస్య పతకం సాధించింది. హర్యానాలోని జజ్జర్ కు చెందిన మను బాకర్ గత ఒలింపిక్స్ లో..పిస్టల్ మొరాయించడంతో పతకం సాధించలేకపోయింది. అయితే..ప్రస్తుత పారిస్ ఒలింపిక్స్ లో మాత్రం 221.7 పాయింట్లతో కంచు మోత మోగించింది. కొరియన్ షూటర్ల జోడీ జిన్ ఏ వో 243.2 పాయింట్లతో స్వర్ణ, కిమ్ ఏజీ 241.3 పాయింట్లతో మొదటి రెండుస్థానాలలో నిలిచారు.

### భారత తొలి మహిళా షూటర్ గా రికార్డు...

12 దశాబ్దాల ఒలింపిక్స్ చరిత్రలో షూటింగ్ క్రీడలో పతకం సాధించిన భారత తొలి మహిళగా మను చరిత్ర సృష్టించింది. 2024 ఒలింపిక్స్ లో భారత్ కు తొలి పతకం అందించిన అథ్లెట్ గౌరవాన్ని సైతం మను దక్కించుకోగలిగింది. మిక్సిడ్ టీమ్ విభాగంలో సరబ్ జోత్ సింగ్ తో జంటగా పతకం వేటకు దిగుతోంది. ఆగస్టు 2న ప్రారంభం కానున్న 25 మీటర్ల వ్యక్తిగత, టీమ్ విభాగాలలో సైతం మను పోటీకి దిగనుంది. మిగిలిన మూడు విభాగాలలో ఒక్క పతకం సాధించినా...ఒకే ఒలింపిక్స్ లో



రెండుపతకాలు సాధించిన భారత తొలి అథ్లెట్ గా మను సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టగలుగుతుంది. 25 మీటర్ల విభాగంలో మను ఏదో ఒకపతకం సాధించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

### తొలిసారిగా మహిళల ఏర్ రైఫిల్ ఫైనల్లో రమిత..

మహిళల 10 మీటర్ల ఏర్ రైఫిల్ ఫైనల్స్ తొలిసారిగా చేరిన భారత యువషూటర్ రమిత జిందాల్ మెడల్ రౌండ్లో మాత్రం విఫలమయ్యింది. క్వాలిఫైయింగ్ రౌండ్లలో 5వ ర్యాంక్ సాధించడం ద్వారా రమిత ఫైనల్స్ చేరుకోగలిగింది. రమిత మొత్తం 631.5 పాయింట్లు సాధించింది. ఫైనల్లో రమిత అదేస్థాయి ప్రతిభ కనబరచలేకపోయింది.

### మూడో పతకం కోసం సింధువేట..

తన కెరియర్ లో చివరిసారిగా ఒలింపిక్స్ లో పాల్గొంటున్న తెలుగుతేజం పీవీ సింధు మూడో పతకం కోసం వేట ప్రారంభించనుంది. 2016 రియో ఒలింపిక్స్ లో రజత, 2020 టోక్యో ఒలింపిక్స్ లో కాంస్య పతకాలు సాధించిన సింధు ప్రస్తుత పారిస్ ఒలింపిక్స్ మహిళల సింగిల్స్ లో మాత్రమే పోటీకి దిగుతోంది. పురుషుల సింగిల్స్ లో లక్ష్యసేన్ వరుసగా రెండో విజయానికి తహతహలాడుతున్నాడు. తొలిరౌండ్లో గ్వాటెమాలా ఆటగాడిని చిత్తు చేసిన లక్ష్య రెండో రౌండ్లో బెల్జియం ఆటగాడితో తలపడనున్నాడు. పురుషుల హాకీ గ్రూప్ - బీ రెండోరౌండ్ పోరులో అర్జెంటీనాతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది.

### అగ్రస్థానంలో జపాన్..22వ స్థానంలో భారత్..

పారిస్ ఒలింపిక్స్ మొదటి రెండురోజుల పోటీలు ముగిసే నాటికి అత్యధిక పతకాలతో జపాన్, కొరియా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, అమెరికా మొదటి ఐదుస్థానాలలో కొనసాగుతున్నాయి. జపాన్ 4 స్వర్ణ, 2 రజత 1 కాంస్యాలతో సహా మొత్తం 7 పతకాలు సాధించింది. కొరియా 4 స్వర్ణ, 2 రజత, 1 కాంస్యతో రెండు, ఆస్ట్రేలియా 4 స్వర్ణ, 2 రజత పతకాలతో మూడు స్థానాలలో నిలిచాయి. అమెరికా 3 స్వర్ణాలతో సహా 12 పతకాలు, ఆతిథ్య ఫ్రాన్స్ 3 స్వర్ణ, 3 రజత, 2 కాంస్యాలతో నాలుగు, ఐదుస్థానాలలో నిలిచాయి. భారత్ ఒకే ఒక్క కాంస్య పతకంతో పతకాల పట్టిక 22వ స్థానంలో ఉంది.